RNI APTEL/25/A0798

# టుడే విదుర


జాతీయ తెలుగు దిన పత్రిక

https://www.todayvidhura.com/

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ  సంపుటి : 1 సంచిక:73  16-10-2025  గురువారం ఎడిటర్ :మర్రి పవీణ్  పేజీలు : 8  వెల 4 /

## అధికారులకు సీఎం చంద్రబాబు సూచనలు

### అధికారులకు సీఎం చంద్రబాబు సూచనలు
### విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్



కర్నూలు, అక్టోబర్ 15 (టుడే విదుర) : దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లపై సీఎం నారా చంద్రబాబు నాయుడు ఈరోజు (అక్టోబరు 15) విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధాని పర్యటనకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో ప్రధానమంత్రి ప్రోగ్రామ్ స్పెషల్ ఆఫీసర్, సీనియర్ ఐఏఎస్ అధికారి వీర పాండియన్, కర్నూలు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రధాని పర్యటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అత్యంత ప్రాధాన్యం కలిగినది అని, అన్ని శాఖల మధ్య సమన్వయం తప్పనిసరిగా ఉండాలని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రతి అంశాన్ని పర్యవేక్షించాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లు, రవాణా, వేదిక, పార్కింగ్, మీడియా సదుపాయాలు అన్నీ సమయానికి సిద్ధం కావాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు దినేష్, విజయ సునీత, డిల్లీ రావు, శౌర్యమాన్ పటేల్, జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశీ, సచిన్, అలాగే పలు విభాగాల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గూగుల్‌తో పాటు అదీ ముఖ్యమే: మంగళగిరిలో నారా లోకేశ్

టాటా హిటాచీ డీలర్‌షిప్ షోరూం, మెషిన్ కేర్ ఫెసిలిటీని ప్రారంభించిన మంత్రి అన్ని రంగాల్లో ఏపీ నెంబర్ వన్‌గా ఉండాలనేదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్య మంగళగిరిలో యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు చేస్తున్నామన్న మంత్రి గూగుల్ తో పాటు డీలర్ షిప్‌లు కూడా ముఖ్యమేనన్న లోకేశ్



మంగళగిరి, అక్టోబర్ 15(టుడే విదుర): ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో నెంబర్ వన్‌గా ఉండాలనేదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, దేశంలోనే మంగళగిరిని అభివృద్ధి పథాన నిలుపుతామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. మంగళగిరి బైపాస్ ఆత్మకూరులో లక్ష్మీ గ్రూప్ ఆధ్వర్యంలో శ్రీ ధనలక్ష్మి ఆటో ఏజెన్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ నూతనంగా ఏర్పాటుచేసిన టాటా హిటాచీ డీలర్ షిప్ షోరూం, మెషిన్ కేర్ ఫెసిలిటీని రిబ్బన్ కట్ చేసి మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. “ఇక్కడకు వస్తుంటే రోడ్డుపైన ఒక ఎక్స్‌కవేటర్ పెట్టారు. అది చూసినప్పుడు నాకు 2019-24 మధ్య రోజులు గుర్తుకు వచ్చాయి. గత ప్రభుత్వంలో శుక్ర, శనివారాలు వస్తే ఈ బుల్డోజర్‌ను ఎవరో ఒకరి ఇంటికి పంపేవారు. ఎవరో ఒకరిని ఇబ్బంది పెట్టాలని గత ప్రభుత్వం ప్రయత్నించింది. ప్రజా ప్రభుత్వంలో మాత్రం ఎక్స్‌కవేటర్స్‌ను అభివృద్ధి కోసం, అమరావతి పనులు, రోడ్ల అభివృద్ధి చేసేందుకు ఉపయోగిస్తోంది. మంగళగిరి అమరావతికి ముఖద్వారం. అమరావతిలో పనులు చేసేవారు మంగళగిరిలోనే ఉండాలి. సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎకోసిస్టమ్ మంగళగిరిలోనే ఇప్పుడు సిద్ధంగా ఉంది. 2019 ఎన్నికల్లో 21 రోజుల ముందు మంగళగిరికి వచ్చాను. మీ సమస్యలను నేను అర్థం చేసుకోలేకపోయాను. నేనేంటో మీకు తెలియదు. 5300 ఓట్ల తేడాతో ఓడిపోయాను. ఐదేళ్లపాటు మీకు అందుబాటులో ఉండి మీ సమస్యలు తెలుసుకున్నాను. ప్రభుత్వం కంటే మెరుగైన సేవా కార్యక్రమాలను ఆనాడు నేను చేశాను” అని లోకేశ్ అన్నారు.

మంగళగిరిలో యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు

2024 ఎన్నికల్లో మంగళగిరిలో పోటీ చేయవద్దని తనను చాలామంది కోరారని, అయినా ఇక్కడి నుంచే పోటీచేసి గెలుస్తానని చెప్పానని లోకేశ్ గుర్తు చేసుకున్నారు. 53 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించాలని ఆనాడు కోరానని, తనను ఏకంగా 91 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించి శాసనసభకు పంపించారని అన్నారు. ఈ రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, సహచర మంత్రులు.. ఇలా ఎవరైనా మంగళగిరి కోసం పని అంటే కాదని చెప్పేవారు లేరని అన్నారు. ఇంటి పట్టాలు, వంద పడకల ఆసుపత్రి, స్మశానాల అభివృద్ధి, కమ్యూనిటీ భవనాలు, భూగర్భ డ్రైనేజీ, తాగునీరు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. మంగళగిరిలో యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు చేస్తున్నామని అన్నారు. బుల్డోజర్‌ను మంచి కార్యక్రమాలకు వినియోగిస్తున్నామని అన్నారు. జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్క్‌ను మంగళగిరిలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఎంత పని ఒత్తిడి ఉన్నా ముందు మంగళగిరికే ప్రాధాన్యత ఇస్తానని, గూగుల్ ఎంత ముఖ్యమో ఈ డీలర్ షిప్ కూడా తనకు అంతే ముఖ్యమని అన్నారు.

## షర్మిలా మతి తప్పి మాట్లాడటం మానుకో..
## యామిని శర్మ స్ట్రాంగ్ కౌంటర్



విజయవాడ, అక్టోబర్ 15(టుడే విదుర): ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కి బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామిని శర్మ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. షర్మిల మతి తప్పి మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. 2.0 అనేది గబ్బర్ సింగ్ ట్యాక్స్ కాదని.. గ్రేట్ సిస్టమ్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్మేషన్ అని అభివర్ణించారు. (బుధవారం) విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు యామిని శర్మ. జీఎస్టీ 2.0.. భారత్ ఆర్థిక స్వావలంబనకు పునాది అని ఉద్ఘాటించారు. జీఎస్టీపై షర్మిల మాట్లాడింది అర్థం లేని రాజకీయ పిచ్చి ప్రచారం మాత్రమేనని ధ్వజమెత్తారు. జీఎస్టీ 2.0 సామాన్యులపై పన్ను భారాన్ని తగ్గించి.. చిన్న వ్యాపారాలకు సులభతరం చేస్తూ, రాష్ట్రాలకు మరింత ఆర్థిక స్వాతంత్ర్యం ఇస్తోందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్‌కి ఇవి ఎందుకు కనిపించవని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలకి అభివృద్ధి కన్నా అబద్ధాల మీద రాజకీ యాలు చేయడం అలవాటని విమర్శించారు యామిని శర్మ. ప్రత్యేక హోదా పేరు చెప్పి ప్రజలను మోసం చేసింది కాంగ్రెస్‌నేనని ఆరోపిం చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించిన కాంగ్రెస్‌కి ప్రత్యేక హోదా గురించి మాట్లాడే హక్కు లేదని ఫైర్ అయ్యారు. కూటమి ప్రభుత్వం ప్రత్యేక అభివృద్ధి హోదాని ఆచరణలో చూపిస్తోందని స్పష్టం చేశారు. కర్నూలులో జరుగబోయే జీఎస్టీ 2.0 ఉత్సవం కేవలం సభ కాదని.. ఇది రాష్ట్ర ఆర్థిక శక్తి పునరుద్ధరణ వేడుక అని అభివర్ణించారు. ఈ సభలో ప్రజలతో కలిసి ఆర్థిక సంస్కరణల సంబురాలు చేయాలని యామిని శర్మ పేర్కొన్నారు.

## ప్రధాని మోదీ ఏపీ పర్యటనలో అప్రమత్తంగా ఉండాలి:
## డీజీపీ హరీష్ కుమార్ గుప్తా



కర్నూలు, అక్టోబర్ 15(టుడే విదుర): ప్రధానమంత్రి నరేంద్రమోదీ కర్నూలు జిల్లా పర్యటనలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశించారు. పోలీసు అధికారులు ప్రణాళిక ప్రకారం సమన్వయంతో పని చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రధాని పర్యటన సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రధాని మోదీ పర్యటనపై కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఇవాళ(బుధవారం) సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో అడిషనల్ డీజీ ఎన్.మధుసూదన్ రెడ్డి, ఐజీ శ్రీకాంత్, డీఐజీలు కోయ ప్రవీణ్, గోపీనాథ్ జెట్టి, సెంథిల్ కుమార్, సత్యయేసు బాబు, ఫక్కీరప్ప కాగినెల్లి, కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పాల్గొన్నారు. ప్రధాని మోదీ పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తీసుకోవాల్సిన భద్రతా చర్యల ఏర్పాట్లపై డీజీపీ పలు సూచనలు చేశారు. ఎవరికీ ఇబ్బందులు కలుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మార్గనిర్దేశం చేశారు. ప్రధాని పర్యటనలో ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రధాని పర్యటన సాఫీగా, ప్రశాంతంగా జరిగేలా గట్టి చర్యలు చేపట్టాలని ఆజ్ఞాపించారు. సామాన్య ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

## పవన్ కల్యాణ్ ‘పల్లెపండుగ 2.0’కు ముహూర్తం ఖరారు



అక్టోబర్ 15 (టుడే విదుర): జనసేన పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ‘పల్లెపండుగ 2.0’ కార్యక్రమానికి సిద్ధమవుతున్నారు. గత ఏడాది విజయవంతమైన ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పారిశుద్ధ్యం, రహదారులు, విద్యుత్ కనెక్షన్లు, మరుగుదొడ్లు, పశువుల కొట్టాలు వంటి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈసారి కూడా గ్రామీణ ముఖచిత్రాన్ని మార్చేలా ప్రణాళికలు ఉండాలని అధికారులకు సూచించారు. వచ్చే నెల చివర్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

## అందుకే గూగుల్‌పై జగన్ అండ్ కోకి కోపం.. సోమిరెడ్డి సెటైర్లు



నెల్లూరు,అక్టోబర్ 15(టుడే విదుర): వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పై తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గూగుల్ పై జగన్ మోహన్ రెడ్డి, ఆయన బ్యాచ్‌కు అంత కడుపు మంట ఎందుకని ఫైర్ అయ్యారు. విశాఖకు గూగుల్ రావడాన్ని వైసీపీ తప్పా అందరూ స్వాగతిస్తున్నారని చెప్పుకొచ్చారు. ఇవాళ(బుధవారం) నెల్లూరు వేదికగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. గూగుల్‌లో 6093 అని కొడితే జగన్ రెడ్డి జైలు జీవితం మొత్తం బయటకొస్తోందని సెటైర్లు గుప్పించారు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి.

## పదేళ్లలో ఏపీ రూపురేఖలు మారిపోతాయ్: మంత్రి కొల్లు రవీంద్ర



విజయవాడ,అక్టోబర్ 15(టుడే విదుర): ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రజాప్రతినిధుల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉమ్మడి కృష్ణాజిల్లాలో 16 సీట్లు టీడీపీకి పట్టం కట్టారని.. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా అంతా కలిసి పని చేస్తామని స్పష్టం చేశారు. జిల్లాలతో పాటు, ఏపీలోనూ పార్టీని ప్రజలకు మరింత చేరువ చేసేలా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించామని తెలిపారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన గూగుల్ డేటా సెంటర్‌కు విశాఖ వేదిక కావడం గొప్ప విషయమని.. అమెరికా తర్వాత ఏపీకే ఈ డేటా సెంటర్ రాబోతుందని తెలిపారు.

# సంపాదకీయం

## ట్రంప్ బాధిత భారత్‌కు దౌత్యవిజయం

ఏ దేశ దౌత్య నీతి అయినా దాని సొంత ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటుంది. అన్ని దేశాలూ స్వీయ ప్రయోజనాలకు అనుగుణంగా పావులు కదుపుతూ దౌత్యంలో చదరంగం ఆడుతుంటాయి. ఈ ప్రక్రియలో భాగంగా తాలిబాన్లతో చిగురిస్తున్న భారత మైత్రి ఒక ఆసక్తికరమైన పరిణామం.మతం పేర మానవతకు మచ్చగా, ధర్మం పేర అధర్మ క్రూరత్వానికి ప్రతీకగా ఉన్న అఫ్ఘానిస్తాన్ పాలకులు ఇస్లామిక్ ఉన్మాద తాలిబాన్లతో హిందుత్వ రాజకీయాలు కేంద్రబిందువుగా మనుగడ సాగించే భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం చెలిమి చేయడం అశేష భారతీయులకు సహజంగా ఆశ్చర్యం కలిగిస్తోంది. హిందువులు, సిక్కులను ఊచకోత కోసిన తాలిబాన్ల నాయకుడికి ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం పోలీసు కవాతుతో స్వాగతించింది. తెలుగువాడయిన దౌత్యవేత్త వి.వెంకటేశ్వరరావును కాబూల్‌లో దారుణంగా చంపిన ఉన్మాదుల నాయకుడికి న్యూఢిల్లీలో ఆరెస్సెస్ అనుబంధ సంస్థ ఒకటి సాదర స్వాగతం చెప్పడం సామాన్య జనానికి దిగ్భ్రాంతి కలిగించింది. అఫ్ఘానిస్తాన్‌లోని తాలిబాన్లకు చేరువ కావడానికి భారతదేశం గత కొంత కాలంగా గల్ఫ్ దేశాల పాలకుల అండదండలతో వ్యూహాత్మకంగా అడుగులు ముందుకు వేస్తూ లక్ష్యాన్ని సాధిస్తోంది. అఫ్ఘానిస్తాన్‌లోని మత ఛాందస తాలిబాన్ల ప్రభుత్వాన్ని రష్యా మినహా భారత్‌తో సహా ప్రపంచ దేశాలు ఏవీ గుర్తించలేదు, అయినా పాకిస్థాన్‌లో పెరిగి అక్కడి మదరసాలో విద్యనభ్యసించి తాలిబాన్ల అగ్రనాయకత్వంలో ఒకడుగా ఎదిగిన అఫ్ఘానిస్తాన్ విదేశీ వ్యవహారాల మంత్రి అమీర్‌ఖాన్ ముత్తఖీని మోదీ సర్కారు ఎర్రతివాచీ పరిచి స్వాగతించడం శరవేగంగా మారుతోన్న దౌత్య సమీకరణాలకు సంకేతం.పాకిస్థాన్ బలం, బలహీనత రెండూ అఫ్ఘానిస్తానే. అసలు తాలిబాన్లు అనేవారు పాక్ సైనిక దళాల నిఘా సంస్థ ఐఎస్ఐ ఉత్పాదిత ఒక క్రూర గెరిల్లాల గుంపు. అఫ్ఘానిస్తాన్‌లో సోవియట్ సేనలకు వ్యతిరేకంగా పోరాటం చేయడానికి అమెరికాతో సహా పాశ్చాత్య దేశాలన్నీ కలిసికట్టుగా పాక్ సహకారంతో తాలిబాన్లను ప్రభవింపచేసి పెంపొందించారు. భారత మిత్రుడు అయిన నజీబుల్లాను 1992లో ముజాహిదీన్లు పదవీచ్యుతిడిని చేశారు. దేశం విడిచి పారిపోలేని నిస్సహాయుత స్థితిలో అతడు కాబూల్ నగరంలో ఐక్యరాజ్యసమితి శరణుజొచ్చాడు. 1996లో తాలిబాన్లు ఐరాస కార్యాలయం నుంచి నజీబ్‌ను అపహరించి కిరాతకంగా హతమార్చి మరీ అధికారాన్ని చేపట్టారు. తొలుత ముజాహిదీన్లతో గానీ, ఆ తరువాత తాలిబాన్లతో గానీ భారతదేశం ఏ విధమైన దౌత్య సంబంధాలు పెట్టుకోలేదు. భారత్ వైఖరి అప్పట్లో తీవ్ర విమర్శలకు గురయింది. ఆ తర్వాత నజీబుల్లా ప్రత్యర్థులు అయిన ముజాహిదీన్లు కొందరితో స్నేహం చేయడం భారత్‌కు అనివార్యమైంది. నజీబుల్లాను కూలద్రోసిన అహ్మద్ షా మసూద్ భారత్‌కు ఆప్తుడయ్యాడు. తాలిబాన్లకు వ్యతిరేకంగా పోరాడిన అహ్మద్ షా మసూద్‌కు భారత్ అన్ని విధాలుగా సహాయమందించింది.తాలిబాన్ల మొదటి ప్రభుత్వ హయాం (1996–2001)లో అఫ్ఘానిస్తాన్‌లో పాకిస్థాన్‌కు ఆడింది ఆటగా పాడింది పాటగా సాగింది. ఆ తర్వాత అమెరికా, నాటో దేశాల చేతుల్లో కీలు బొమ్మలు అయిన పాలకులు 2021 వరకు అఫ్ఘానిస్తాన్‌ను పరిపాలించినా తాలిబాన్లను నిర్మూలించలేకపోయారు. అమెరికా నిష్క్రమణ అనంతరం 2021లో అఫ్ఘానిస్తాన్‌లో మళ్లీ అధికారాన్ని స్వాధీనం చేసుకున్న తాలిబాన్లు ఈ సారి పాక్ పాలకుల కనుసన్నలలో కాకుండా స్వతంత్రంగా బాహ్య ప్రపంచం వైపు చూడడం మొదలుపెట్టారు. పాకిస్థాన్‌తో విబేధిస్తూ తమ దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యమివ్వడం ప్రారంభించారు. తమకు ఆలంబనగా భారత్‌ను ఎంచుకున్నారు. తరం మారడంతో ఆలోచన సరళి కూడా మారింది. గతంలో పాకిస్థాన్ చెప్పినట్లుగా తాలిబాన్ల అధినాయకుడు ముల్లా ఉమర్ నడువగా ఇప్పుడు అతని కుమారుడు, ప్రస్తుత రక్షణమంత్రి ముల్లా యాఖూబ్ అలా నడువాలనుకోవడం లేదు. ఖతర్‌లో భారత విదేశాంగ శాఖ అధికారులతో ముల్లా యాఖూబ్ సమావేశం కావడం ఆ తర్వాత దుబాయిలోనూ అఫ్ఘానిస్తాన్ విదేశీ వ్యవహారాల మంత్రి ముత్తఖీ సమావేశం కావడం పాకిస్తాన్‌ను కలవరపరిచింది. పహల్గాంలో ఉగ్రదాడిని పాకిస్థాన్ పేరు ప్రస్తావిస్తూ పొరుగున ఉన్న నేపాల్ ఖండించలేదు కానీ అఫ్ఘానిస్తాన్ మాత్రం నిర్ద్వంద్వంగా ఖండించింది, ఇది మామూలు విషయం కాదు. భారత దౌత్యనీతికి విజయం. అయినా మోదీ ప్రభుత్వం ఈ విజయాన్ని బహిరంగంగా చెప్పుకోలేని ఇరకాటంలో ఉన్నది.దాయాది దేశానికి ఊపిరాడనివ్వకుండా చేస్తోన్న తాలిబాన్లతో భారత్ వ్యూహాత్మక స్నేహం మన దేశ ప్రయోజనాలు లక్ష్యంగా ఉన్నదే, సందేహం లేదు. భారత్‌కు చెప్పుకోదగ్గ ఈ దౌత్య విజయం డోనాల్డ్ ట్రంప్ చేసిన గాయాల తర్వాత ఒక ఉపశమనం. దేశీయ రాజకీయాల విషయానికి వస్తే, ఒకవేళ కాంగ్రెస్ పార్టీయే తాలిబాన్లతో ఇటువంటి మైత్రి చేసి ఉన్నట్లయితే బీజేపీ అగ్గిరాజేసేదని ప్రత్యేకంగా చెప్పవల్సిన అవసరం లేదు.

## దీపావళి ఎఫెక్ట్...

# ఒక్కరాత్రే ఆ నగరంలో రూ.7 కోట్ల వస్త్ర వ్యాపారం



చెన్నై,అక్టోబరు 15 (టుడే విదుర): దీపావళి పండుగను పురస్కరించుకుని ఈరోడ్ వారాంతపు సంతలో రూ.7 కోట్ల మేర వస్త్ర వ్యాపారం జరిగింది. ఈ జిల్లా కేంద్రంలో ప్రతి రాత్రి వారాంతపు వస్త్ర సంత నిర్వహిస్తుంటారు. దక్షిణ భారతదేశంలోనే ఎంతో ప్రసిద్ధిగాంచిన ఈ సంతకు పొరుగు రాష్ట్రాలైన కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వస్త్ర వ్యాపారులు వచ్చి తమకు కావాల్సిన దుస్తులను భారీ మొత్తంలో కొనుగోలు చేస్తుంటారు.ఆ ప్రకారంగా రాత్రి జరిగిన ఈ సంతలో ఏకంగా రూ.7 కోట్ల మేర వస్త్ర వ్యాపారం జరిగిందని స్థానిక వ్యాపారులు వెల్లడించారు. దీపావళి పండుగకు మరో ఐదు రోజులే ఉన్న నేపథ్యంలో ఈ వారంతపు సంతకు కొనుగోలుదారులు పోటెత్తారు. ఒక్క రోజే హోల్‌సేల్ వ్యాపారం 50 శాతం, చిల్లర వ్యాపారంగా 60 శాతం మేరకు జరిగినట్టు వ్యాపారులు వెల్లడించారు.

# కార్పొరేట్ల గుప్పెట్లో పచ్చని భూములు

కర్నూలుఅక్టోబరు 15 (టుడే విదుర): అభివృద్ధి, ఉద్యోగాలు, ఉపాధి పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పచ్చని పంట పొలాలను కార్పొరేట్ల కట్టబెడు తున్నాయి. కర్నూలు జిల్లాలో 2015 నుంచి ఇప్పటికే 20 వేల ఎకరాలు వారి గుప్పిట్లోకి వెళ్లిపోయాయి. మరో 15 వేల ఎకరాలను కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. 2015లో గడివేముల మండలం ఘని, శకునాల గ్రామాల పరిధిలో కర్నూలు అల్ట్రా మెగా సోలార్ పార్క్ పేరుతో ఆరు వేల ఎకరాలను ప్రభుత్వం కేటాయిం చింది. ఈ ప్రాజెక్టును ఒక గిగావాట్స్ ఉత్పత్తి సామర్థ్యంతో ప్రారంభించారు. అయినా, స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వలేదు. డి-పట్టా భూములనే పేరుతో రైతులకు నష్టపరిహారం ఇవ్వకుండానే భూములు తీసుకోవాలని ప్రయత్నం చింది. దీనికి వ్యతిరేకంగా సిపిఎం, రైతు సంఘాల పోరాటం ఫలితంగా అప్పటి టిడిపి ప్రభుత్వం చివరికి 1,800 మంది రైతులకు ఎకరాకు రూ.4.20 లక్షల చొప్పున పరిహారం అందించింది. ఓర్వకల్లులోని జయరాజ్ ఇస్పాత్ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. ఈ ప్లాంట్ వల్ల ప్రత్యక్షంగా 1,100 మందికి, పరోక్షంగా ఆరు వేల



మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. రెండు వేల ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. ఆ ప్లాంట్‌ను ఈ నెల 16న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ఇప్పటి వరకు సుమారు 3,200 మందికి ఉపాధి కల్పించినట్టు చెబుతున్నారు. అదే మండలంలోని నన్నూరు గ్రామ పంచాయతీ పరిధిలో డ్రోన్ హబ్ కోసం సుమారు 300 ఎకరాలను ప్రభుత్వం బలవంతంగా లాక్కొంది. దీని నిర్మాణ పనులకు ప్రధాని మోదీ ఈ నెల 16న శంకుస్థాపన చేయనున్నారు. 2018లో ఓర్వకల్లు మండలం గుమ్మితం తండా, పాణ్యం మండలం పిన్నాపురం ప్రాంతాల్లో గ్రీన్‌కో పేరుతో ఇంటిగ్రేటెడ్ పవర్ ప్రాజెక్టుకు ప్రభుత్వం 4,500 ఎకరాలను కట్ట బెట్టింది. రైతులు సాగు చేసుకుంటున్న రెండు వేల ఎకరాల్లో పట్టాలు ఉన్న వంద మంది రైతులకు చెందిన 500 ఎకరాలకు మాత్రమే ఎకరాకు రూ.8 లక్షల నుంచి రూ.11 లక్షల వరకూ పరిహారాన్ని అందించారు. ఏళ్ల కాలంగా మరో 300 మంది రైతులు 1500 ఎకరాలు సాగు చేసుకుంటున్నా పరిహారం ఇవ్వలేదు. 2022 సెప్టెంబర్‌లో నంద్యాల జిల్లా కొలిమిగుండ్లలో రామ్‌కో పరిశ్రమను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రారంభించినప్పుడు దాదాపు వెయ్యి మందికి ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. ప్రస్తుతం ఆ సంఖ్యలో ఉద్యోగులు ఉన్నా, వారిలో స్థానికులు 300 మందే. కర్నూలు అల్ట్రా మెగా సోలార్ పార్క్‌కు భూములు ఇచ్చిన రైతుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. మొత్తం 1800 రైతు కుటుంబాలు ఉండగా, 25 మంది ఐటిఐ వారికి, పది మంది డ్రైవర్లకు మాత్రమే అందులో ఉద్యోగాలు కల్పించారు. తాజాగా పత్తికొండ మండలం హోసూరు, పెద్దహుల్తి గ్రామాల్లో సోలార్ విద్యుదుత్పత్తి కోసం టాటా పవర్ కంపెనీ రైతుల నుంచి 1800 ఎకరాలను సేకరిస్తోంది. ఆ ప్రాంతంలో రైతులు వేరుశనగ, ఉల్లి, వాము, జొన్న, కొత్తిమీర తదితర పంటలను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మధ్య దళారులు రైతులను మభ్యపెట్టి పంట భూములను కారు చౌకగా ప్రయివేట్ కంపెనీలకు దోచిపెడుతున్నారు. ఇప్పటికే రైతుల నుండి దాదాపు వెయ్యి ఎకరాలకు లీజు ఒప్పందం జరిగినట్లు సమాచారం. ఆలూరు, హొళగుంద, ఆస్పరి, చిప్పగిరి మండలాల్లో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు సాయిరాం, పెంటాగాన్, దత్తు, టిబివి గ్రూప్ కంపెనీలు కలిసి ఐదు వేల ఎకరాలను రైతుల నుంచి సేకరిస్తు న్నాయి. వాటికి తోడు ఓర్వకల్లు మండలం మీదివేముల, కొమరోలు, పాలకొలను, గుట్టపాడు, పూడిచర్ల గ్రామాల్లో 15 వేల ఎకరాలను రైతుల నుంచి లాక్కొని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ఎపిఐఐసి సిద్ధం అవుతోంది.

# గ్రంథాలయాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి : డివైఎఫ్ఐ



-విజయనగరం అక్టోబరు 15 (టుడే విదుర): రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని డి వై ఎఫ్ ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న డిమాండ్ చేశారు. బుధవారం కోట జంక్షన్ వద్ద నిరుద్యోగ అభ్యర్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దీర్ఘకాలికంగా అనేక శాఖల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. గత 20 ఏళ్లుగా గ్రంథాలయాల్లో పోస్టులు భర్తీ చేయలేదన్నారు. స్వాతంత్ర పోరాటంలో కీలకపాత్ర పోషించిన గ్రంథాలయాలు గత ఇరవై ఏళ్లుగా నిర్వీర్యం చేస్తున్నారన్నారు. రెండు లక్షలు పోస్టులు భర్తీ చేయాల్సి ఉందని తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో కాలేజీల్లో గ్రంథాలయాలు లేకుండా ఉన్నాయన్నారు. విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. గ్రంథాలయాలను కాపాడాలని డిమాండ్ చేశారు. వెంటనే గ్రంథాలయ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో డి వై ఎఫ్ ఐ జిల్లా కన్వీనర్ హరీష్, సతీష్ నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.


# కాకినాడ సెజ్ అవార్డు భూములు తిరిగి రైతులకే

- రిజిస్ట్రేషన్ రుసుము, స్టాంప్ డ్యూటీ మినహాయింపు
- ప్రభుత్వం ప్రకటన
- మిగిలిన భూముల మాటేమిటి?




అమరావతి అక్టోబరు 15 (టుడే విదుర):కాకినాడ సెజ్ పేరుతో రైతుల నుంచి బలవంతంగా లాక్కొన్న భూముల్లో కొన్నింటిని తిరిగి వారికే రిజిస్ట్రేషన్ చేసి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు. ఆయా భూముల రిజిస్ట్రేషన్లకు రిజిస్ట్రేషన్ ఛార్జీలు, స్టాంప్ డ్యూటీలు వసూలు చేయకూడదని పేర్కొన్నారు. 2,180 ఎకరాలను ప్రభుత్వం వెనక్కి ఇవ్వడం ద్వారా ఉప్పాడ, కొత్తపల్లి, తొండంగి మండలాల పరిధిలో 1,551 మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని ఆమె తెలిపారు. కాకినాడ సెజ్‌కు భూములు ఇవ్వడానికి కొందరు రైతులు వ్యతిరేకించారు. అయినా, ప్రభుత్వం వారి నుంచి బలవంతంగా భూములను లాక్కొంది. ఈ భూములకు సంబంధించిన నష్టపరిహారాన్ని బ్యాంకులో జమ చేసింది. అయినాకూ, ఆ డబ్బులను రైతులు తీసుకోలేదు. దీంతో, వీరికి సంబంధించిన భూములను తిరిగి వారికి అప్పగించాలని గత వైసిపి ప్రభుత్వం నిర్ణయించి జిఒ 12 విడుదల చేసింది. ఈ మేరకు 986 ఎకరాలకు గత ప్రభుత్వంలోనే రిజిస్ట్రేషన్ పూర్తయింది. 1,551 మంది రైతులకు చెందిన మిగిలిన 1,194 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరగలేదు. ఈ సమస్యను ఇటీవల శాసన మండలిలో సమావేశాల్లో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్ ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. గతంలో ఇచ్చిన మేరకు డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ స్పందించారని, సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారని జనసేన వర్గాలు పేర్కొన్నారు.

# 'తాండవ'కు వరదపోటు



నాతవరం, అక్టోబరు 15 (టుడే విదుర): తాండవ రిజర్వాయర్‌లోకి ఒక్కసారిగా ఇన్‌ఫ్లో పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో పలు గెడ్డలు, వాగుల నుంచి వరద నీరు పెద్ద ఎత్తున జలాశయంలోకి వచ్చి చేరుతున్నది. తాండవ గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులుకాగా, 1,600 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. దీంతో నీటిమట్టం 377 అడుగులకు చేరింది. ఆయకట్టుకు కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా 537 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. అవుట్ ఫ్లో కంటే ఇన్‌ఫ్లో మూడురెట్లు అధికంగా వుండడంతో రిజర్వాయర్‌లో నీటినిల్వలు పెరుగుతున్నాయి. రానున్న రెండు, మూడు రోజుల్లో పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసి, జలాశయంలోకి వరద పోటెత్తితే పూర్తి నిండే అవకాశం వుంది. నీటిమట్టం 379 అడుగులకు చేరితే స్పిల్‌గేట్లు ఎత్తి అదనపు నీటిని తాండవ నదిలోకి విడుదల చేస్తామని ప్రాజెక్టు డీఈఈ అనురాధ తెలిపారు. ప్రస్తుత పరిస్థితులనుబట్టి ఆయకట్టుకు నీటి కొరత ఏర్పడే అవకాశం లేదని అన్నారు.

## ప్రభుత్వ సబ్సిడీ సరే

# ఫ్యాక్టరీల రూ.8 వేల సంగతేంటి?



చిత్తూరు అక్టోబరు 15 (టుడే విదుర): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మేరకు చిత్తూరు జిల్లాలో మామిడి సరఫరా చేసిన 31,929 మంది రైతులకు ప్రభుత్వ సబ్సిడీ రూ.147 కోట్లు విడుదల చేసింది. అయితే, ఫ్యాక్టరీలు ఎంతిస్తాయనే విషయాన్ని మాత్రం ప్రభుత్వాధికారులు తేల్చి చెప్పలేకపోతున్నారు. ప్రభుత్వం అందించిన సబ్సిడీ జాబితాలో 20 మంది రైతులకు సెంటు భూమి లేకపోవడం, 21 మందికి ఐదు లక్షలపైగా సబ్సిడీ జమ ఉండడంతో వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి జమ చేయనున్నట్లు తెలుస్తోంది. మామిడి సీజన్ ప్రారంభంలో జ్యూస్ ఫ్యాక్టరీల యాజమాన్యాలతో చిత్తూరు జిల్లా కలెక్టర్, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు చర్చోపచర్చలు జరిపారు. చివరకు టన్నుకు రూ.8 వేలు ఇచ్చేలా ఫ్యాక్టరీ యజమానులను ఒప్పించారు. ఫ్యాక్టరీలు టన్నుకు రూ.8 వేలు ఇస్తే, ప్రభుత్వం రూ.4 వేలు ఇస్తుందని, తద్వారా రైతుకు టన్నుకు రూ.12 వేలు లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం ఫ్యాక్టరీల యాజమాన్యంతో ప్రత్యేకంగా మాట్లాడి ఇదే విషయాన్ని వెల్లడించారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సైతం చిత్తూరు, గుడిపాలలో నిర్వహించిన మామిడి రైతుల సమావేశంలో ఫ్యాక్టరీలు టన్నుకు రూ.8 వేలు చెల్లించాలని నిర్ణయించామని తెలిపారు. ప్రభుత్వ హామీతో 31,929 మంది రైతులు 3.67 లక్షల మెట్రిక్ టన్నుల మామిడిని ఫ్యాక్టరీలు, ర్యాంపులు, మామిడి కాయల మండీల ద్వారా విక్రయించారు. ముఖ్యమంత్రి మాటలను, కలెక్టర్ హామీని ఏ ఒక్క జ్యూస్ ఫ్యాక్టరీ అమలు చేయలేదు. టన్నుకు మూడు వేల రూపాయల నుంచి ఐదు వేల రూపాయలు లోపే ఇచ్చాయి. సీజన్ ముగిసి రెండున్నర నెలలు కావస్తున్నా నేటికీ అనేక ఫ్యాక్టరీలు మామిడి రైతుల బిల్లులు చెల్లించలేదు. మూడు ఫ్యాక్టరీలకు రాయితీలు కట్ : కలెక్టర్ రైతుల నుండి మామిడి తోలుకొని టన్నుకు రూ.3 వేల నుంచి 4 వేలు ఇచ్చి చేతులు దులుపుకున్న ఫ్యాక్టరీలు పుంగనూరు, గుడిపాల, బంగారుపాళ్యం ప్రాంతాల్లో ఉన్నాయి. ఈ ఫ్యాక్టరీలకు ప్రభుత్వం నుండి ఎలాంటి సహకారమూ ఉండదని జిల్లా కలెక్టర్ ప్రకటించారు. ఈ ఫ్యాక్టరీలకు మామిడి సరఫరా చేసిన మామిడి రైతులు ప్రభుత్వ సబ్సిడీతో కలిపి టన్నుకు రూ.6 వేల నుంచి రూ7 వేలు మించి పొందలేకపోయారు. నేడు బంగారుపాళ్యంలో మామిడి రైతుల ఆక్రందన సభ మామిడి రైతులకు జరుగుతున్న తీవ్ర అన్యాయంపై మామిడి రైతుల సంక్షేమ సంఘం బంగారుపాళ్యంలోని మామిడి మార్కెట్ యార్డు వద్ద ఆక్రందన సభకు బుధవారం పిలుపునిచ్చింది. రైతు సంఘం నాయకులు ప్రభాకరరెడ్డి, రామానాయుడు తదితరులు హాజరు కానున్నారు. మామిడి రైతుల పోరాటానికి సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్, కాంగ్రెస్ మద్దతు ప్రకటించాయి. ఇచ్చిన మాట ప్రకారం టన్నుకు ప్రభుత్వ సబ్సిడీతో రూ.12 వేలు చెల్లించాలని మామిడి రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రకటించిన మద్దతు ధర సైతం ఇవ్వకపోవడం పట్ల ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకొనేందుకు జిల్లాలోని రైతులు సిద్ధం అవుతున్నారు. దీంతో, ప్రభుత్వం ఇవ్వాల్సిన సబ్సిడీని రైతుల ఖాతాలో జమ చేసింది.

## పర్వతారోహణలో

# కర్నూలు యువకుడి రికార్డు



### ప్రపంచంలోని టాప్-9 శిఖరాల అధిరోహణ

### దేశంలోనే తొలి వ్యక్తిగా ఘనత

న్యూఢిల్లీ,అక్టోబరు 15 (టుడే విదుర): ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుకు చెందిన 36 ఏళ్ల పర్వతారోహకుడు తమ్మినేని భరత్ అరుదైన ఘనత సాధించారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 14 శిఖరాల్లో ఒకటైన చైనాలోని మౌంట్ చో ఒయు పర్వతాన్ని (8,188 మీటర్లు) అధిరోహించారు. కాగా ఇప్పటికే ఆయన 8 అత్యంత ఎత్తైన పర్వతాలను విజయవంతంగా అధిరోహిం చారు. తాజాగా మౌంట్ చో ఒయు పర్వతాన్ని ఎక్కి.. ప్రపంచంలోని ఎత్తైన శిఖరాలలో తొమ్మిదింటిని అధిరోహించిన మొదటి భారతీయునిగా నిలిచారు. భరత్ 2017 మే లో మౌంట్ ఎవరెస్ట్.. సెప్టెంబర్ 2018లో మౌంట్ మనస్లు, మే 2019లో మౌంట్ లోట్సే, మార్చి 2022లో అన్నపూర్ణ, ఏప్రిల్ 2022లో కాంచన్‌జంగా, మే 2023లో మకాలు, అక్టోబర్ 2024లో శిశాపాంగ్మా, ఏప్రిల్ 2025లో మౌంట్ ధౌలగిరి%ొ%.తదితర 8,000 మీటర్లకు పైగా ఎత్తైన శిఖరాలను అధిరోహించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

మౌంట్ చో ఒయు పర్వతాన్ని అధిరోహించడానికి భరత్ సెప్టెంబర్ 30న చైనాలోని చో ఒయు బేస్ క్యాంప్‌కు చేరుకున్నారు. అయితే ఆ సమయంలో అక్కడి ప్రతికూల వాతావరణం, భారీ హిమపాతం కారణంగా పర్వతాన్ని ఎక్కే ప్రయత్నాలు విరమించుకోవాల్సి వచ్చింది. దీంతో నాటి నుంచి అక్కడే ఉన్నారు. ఉదయం 6.55 గంటలకు ట్రెక్కింగ్ ప్రారంభించి, 8.55 గంటలకు పర్వత శిఖరాన్ని చేరుకున్నట్లు తెలిపారు. దీంతో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 14 శిఖరాల్లో తొమ్మిదింటిని విజయవంతంగా అధిరోహించి..రికార్డు నెలకొల్పారు. ఇక మిగిలిన 5 పర్వతాలు పాకిస్థాన్‌లో ఉన్నందున ప్రస్తుతానికి వాటిని అధిరోహించేందుకు వీలు కుదరడం లేదని, సమీప భవిష్యత్తులోనే ఆ శిఖరాలను కూడా అధిరోహిస్తానని భరత్ తెలిపారు.

# అమ్మో చంద్రంపేట గెడ్డ



### వర్షాకాలంలో పొంచి ఉన్న అపాయం

### ఏటా ప్రమాదంలో చిక్కుకుంటున్న వైనం

### తాజాగా మరొకరు గల్లంతు

### వంతెన నిర్మాణానికి పడని ముందడుగు

గంట్యాడ, అక్టోబరు 15 (టుడే విదుర): వసంత- చంద్రంపేట గెడ్డ పేరు చెబితే చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వణికిపోతున్నారు. వర్షాకాలంతో నరకయాతన పడుతున్నారు. నిత్యావసరాలకు, ఇతర పనులకు గెడ్డ దాటాల్సి రావడంతో భయపడుతూనే అవతలి ఒడ్డుకు వెళుంటారు. ఈ క్రమంలో గల్లంతైన ఘటనలు కోకొల్లలు. తాజాగా చిన వసంత గ్రామానికి చెందిన విజ్జపు సోమరాజు(55) గల్లంతయ్యాడు. మంగళవారం సాయంత్రం వరకు ఆచూకీ లభించలేదు. గెడ్డపై వంతెన నిర్మాణానికి అడుగు పడకపోవడంతో ఆయా గ్రామాల వారు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

చిన వసంత గ్రామానికి చెందిన చిరు వ్యాపారి విజ్జపు సోమరాజు విజయనగరం పట్టణంలోని ఓ కిరాణా షాపులో పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి రాత్రి బయలుదేరాడు. 10.30 సమయంలో ద్విచక్ర వాహనంపై వస్తూ చంద్రంపేట గెడ్డ దాటుతుండగా నీటి ప్రవాహానికి కొట్టుకుపోయినట్లు స్థానికులు భావిస్తున్నారు. సోమరాజు తనతో తీసుకువచ్చిన పచ్చిమిర్చి, ఇడ్లీ నూక ప్యాకెట్లతోపాటు ద్విచక్రవాహనం బయటపడింది కానీ సోమరాజు ఆచూకీ లభించలేదు. ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు గాలించినా ఆచూకీ తెలియలేదు. తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, ఎస్ఐ సాయికృష్ణ, ఎంపీడీవో రమణమూర్తితోపాటు రెవెన్యూ, పంచాయతీ అధికారుల పర్యవేక్షణలో గాలింపు జరుగుతోంది.

గెడ్డలో నిత్యం ప్రమాదాలు

గెడ్డ దాటుతున్న సమయంలో ప్రతి ఏడాది ఒకరు, ఇద్దరు మృతి చెందుతున్నారు. వర్షాకాలంలో గెడ్డ దాటాలంటే స్థానికులు భయపడుతున్నారు. పొలాలకు, పశువుల కళ్లాలకు వెళ్లే రైతులు నిత్యం భయం భయంతో గడుపుతున్నారు. గెడ్డకు వర్షా కాలంలో వరద నీరు అధికంగా వస్తుంది. కాజ్‌వే చాలా కిందకు ఉండటంతో నీరు వచ్చిన సమయంలో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఆర్.వసంత గ్రామ ప్రజలు అయితే మరింత ఇబ్బంది పడాల్సి వస్తోంది. విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కొటారుబిల్లి కూడలి సిరిపురం, చంద్రంపేట, ఆర్.వసంత గ్రామాలకు ఆర్టీసీ బస్సు కూడా నడుస్తుంది. గెడ్డ అధికంగా వచ్చిన సమయంలో బస్సు రాకపోకలు కూడా నిలిచిపోతున్నాయి.

# మొక్కజొన్న కొనేదెవరు?



### ఎండబెట్టిన మొక్కజొన్న గింజలు

### భామినిలో విస్తారంగా సాగు

### చేతికందిన పంట కొనుగోలుదారులు

### లేక రైతుల దిగాలు

భామిని, అక్టోబరు 15(టుడే విదుర): మండలంలో ప్రధాన పంట వరి. రెండో ప్రాధాన్యతగా పత్తిని రైతులు సాగు చేస్తుంటారు. అయితే, ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు పత్తికి బదులు మొక్కజొన్న సాగుకు మొగ్గుచూపారు. ఘనసర, సతివాడ, చిన్నదిమిలి, బాలేరు, దిమ్మిడిజోల, భామిని, పసుకుడి, సింగిడి, బిల్లుమడ తదితర గ్రామాల్లో సుమారు 1500 ఎకరాల్లో మొక్కజొన్న సాగులో ఉంది. వాతావరణం అనుకూలంగా లేకపోయినా ఎలాగో నెట్టుకొచ్చారు. ఇటీవల భారీ వర్షాలకు పంట నేలమట్టమైంది. దీంతో గింజలకు మొలకలు వస్తాయనే భయంతో రైతులు ఆదరాబాదరాగా పంటను సేకరించారు. యంత్రాల ద్వారా పిక్కలు సేకరించి వీధులు, రోడ్లపై ఆరబెడుతున్నారు. అయితే, ఇప్పటికీ పంట అమ్ముడుకాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలుదారులు ఎవరూ ముందుకు రావడం లేదని వారు దిగులు చెందుతున్నారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులతో మబ్బులు వేస్తున్నాయని, ఏ క్షణం లోనైనా వర్షం వచ్చి గింజలు తడిచిపోతాయేమోనని ఆందోళనగా ఉందని రైతులు అంటున్నారు.

# తిరుపతిలో కోర్టు కాంప్లెక్సుకు రూ.115.12 కోట్లు

తిరుపతి, అక్టోబరు 15 (టుడే విదుర): తిరుపతిలో కోర్టు భవనాల సముదాయం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.115.12 కోట్లు మంజూరు చేసింది. తిరుపతి రూరల్ మండలం దామినేడులో కోర్టు భవనాల సముదాయం కోసం ప్రభుత్వం ఇటీవల 14 ఎకరాలు కేటాయించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం తిరుపతి నగరం వేశాలమ్మ గుడి వీధిలోని కోర్టు కాంప్లెక్సు తక్కువ స్థలంలో ఏర్పాటైంది. అందులో పలు భవనాలు బ్రిటిష్ కాలం నాటివి కావడంతో శిధిలావస్థకు చేరాయి. వాహనాల పార్కింగ్‌కు కూడా స్థలంలేదు. దీంతో కోర్టుల నిర్వహణ ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యాన్ని వివరిస్తూ దామినేడులో కొత్తగా కేటాయించిన 14 ఎకరాల్లో నూతన కోర్టు సముదాయం నిర్మించాల్సి ఉంది. దీనికి అవసరమైన నిధులను కేటాయించాలని కోరుతూ హైకోర్టు రిజిస్ట్రార్ (అడ్మినిస్ట్రేషన్) ఈ ఏడాది జూలై 5, సెప్టెంబరు 11, 20 తేదీల్లో ప్రభుత్వానికి లేఖలు రాశారు. దీనికి స్పందించిన ప్రభుత్వం సీఎసఎస్ పథకం (న్యాయ శాఖకు మౌళిక సదుపాయాల కల్పన) కింద రూ. 115.12 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో దామినేడులో 16 భవనాలతో కూడిన కోర్టు సముదాయం నిర్మించేందుకు పరిపాలనా ఉత్తర్వులు జారీ చేసింది.

# వేళకు రాని బస్సులు



బొమ్మనహాళ్, అక్టోబరు 15 (టుడే విదుర):మండలంలోని గోనేహాళ్ క్రాస్, ఉప్పరహాళ్ క్రాస్, ఉద్దేహాళ్ గ్రామాల మీదుగా బొమ్మనహాళ్‌కు వెళ్లే బస్సులు వేళకు రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజూ ఉదయం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లడం వారికో సవాల్‌గా మారింది. విద్యార్థులు సమయానికి తరగతులకు హాజరు కాలేకపోతున్నారు. అలాగే సాయంత్రం ఆలస్యంగా ఇళ్లకు చేరుతున్నారు. ప్రతి రోజూ బస్టాండ్‌ల వద్ద విద్యార్థులు బస్సు కోసం వేచి ఉండే పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు మాత్రం సర్వీసులు క్రమంగా.. సజావుగా.. నడుస్తున్నాయి అంటున్నారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు వేళకు వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, గ్రామస్థులు కోరుతున్నారు.

# రైల్వే స్టేషన్‌లో.. 1.600 గ్రాముల గంజాయి చాక్లెట్లు స్వాధీనం



సికింద్రాబాద్:అక్టోబరు 15 (టుడే విదుర): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో గంజాయి చాక్లెట్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్లాట్‌ఫారం నంబరు 10( 10)లో మంగళవారం స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఓ వ్యక్తి పోలీసులను చూసి బ్యాగ్ వదిలేసి పారిపోయాడు. పోలీసులు బ్యాగ్‌ను స్వాధీనం చేసుకొని చూడగా అందులో 1.600 గ్రాముల గంజాయి చాక్లెట్లు లభించాయి. చాక్లెట్లను సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

## బ్లాక్ ప్లాంటేషన పనుల పరిశీలన



నల్లచెరువు, అక్టోబరు 15 (టుడే విదుర): మండల పరిధిలోని ఓరువాయి గ్రామ పంచాయతీ కుమ్మరవాండ్లపల్లి ఆంజనేయస్వా మి ఆలయ భూముల్లో బ్లాక్ ప్లాంటేషనలో భాగంగా 110 మామి డి, టెంకాయ, అల్లినేరేడు మొక్కలను నాటే కార్యక్రమం నిర్వహిం చారు. ఏపీడీ శకుంతల మంగళవారం కార్యక్రమాన్ని పరిశీలించి, మొక్కలు నాటారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతులు పండ్ల మొక్కల పెంపకం పథకాలను సద్వినియోగం చేసుకోవా లని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ మంజునాథ్, ఈసీ సుబ్బారెడ్డి, టి. రమేష్, టీడీపీ నాయకులు దేవేంద్రగౌడ్, సతీష్‌నాయుడు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైలులో ప్రయాణికురాలిపై అత్యాచారం



గుంటూరు అక్టోబరు 15 (టుడే విదుర): రైలులో ప్రయాణికురాలిపై అత్యాచారం జరిగిన ఘటన బుధవారం గుంటూరులో జరిగింది. బాధితురాలు రాజమహేంద్రవరంలోని సంత్రగచి ప్రత్యేక రైలులో ఎక్కింది. ఆమె ఎక్కిన బోగీ మొత్తం ఖాళీగా ఉంది. గుంటూరు నుంచి పెద్దకూరపాడు మధ్య రైలు వెళుతుండగా, రన్నింగ్ ట్రైన్ లో మహిళ బోగిలోకి ప్రాధేయపడి 40ఏళ్ల వ్యక్తి చొరబడ్డాడు. ఒంటరిగా ఉన్న ఆ మహిళను ఆ వ్యక్తి కత్తితో బెదిరించాడు. హ్యాండ్ బ్యాగ్, సెల్ ఫోన్ లాక్కొని, డబ్బులు లాక్కొని అత్యాచారం చేశాడు. బాధితురాలిపై అత్యాచారం చేసిన వ్యక్తి పెద్దకూరపాడు స్టేషన్ వద్ద దిగి పారిపోయాడు. రైలు చర్లపల్లికి రాగానే బాధిత మహిళ నేరుగా సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రస్తుతం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నారు.

## కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



కోటనందూరు:అక్టోబరు 15 (టుడే విదుర): కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీనియర్ నాయకులు కె.సత్తిరాజు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో సిఐటియు మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్ లు రద్దుచేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను పరిరక్షించుకునేందుకు పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల కన్వీనర్‌గా ఎస్‌కె.పద్మ, కో కన్వీనర్‌గా ముక్కుడుపల్లి బాబారావులతో కలిపి 18 మంది సభ్యులతో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో 9 కార్మిక రంగాలకు చెందిన కార్మికులు రవణమ్మ, పద్మ, లీల, లోవకుమారి శ్రీదేవి, మరియారత్నం, వెంకటలక్ష్మి, సత్యవతి, దేవుడమ్మ, అమ్మోజి, అప్పల నరస, తదితరులు పాల్గొన్నారు.

# నగరపాలక సంస్థ కమిషనర్ గా రాహుల్ మీనా బాధ్యతలు స్వీకరణ



రాజమహేంద్రవరం అక్టోబరు 15 (టుడే విదుర): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ (ఆర్ఎంసి) కమిషనర్ గా రాహుల్ మీనా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ గా పనిచేస్తున్న ఆయనను రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్ కు కమిషనర్ గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆర్ఎంసి కార్యాలయంలో కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించారు. తొలుత కార్యాలయ ఆవరణలోని శ్రీశ్రీశ్రీ అభయ కనకదుర్గాదేవి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ మీనా మాట్లాడుతూ.. నగరపాలక సంస్థ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. పురవాసులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, సమస్యలుంటే తనను సంప్రదించాలని కోరారు. నగర ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని వెల్లడించారు. సాంకేతికత సాయంతో గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తామని వివరించారు. అలాగే మునిసిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అధికారులు, సిబ్బంది సహకరించాలని కోరారు. అనంతరం పలువురు అధికారులు కమిషనర్ కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజ వల్లి, ఎస్ఈ(ఇంఛార్జి) రీటా, ఎంహెచ్ఓ వినూత్న, డిప్యూటీ సిటీ ప్లానర్ నాయుడు, రెవెన్యూ అధికారులు సీహెచ్ శ్రీనివాసరావు, రవికుమార్, మేనేజర్ ఎండి అబ్దుల్ మలిక్, ఈఈ మదర్సా అలీ, సీటీసీ ఇంఛార్జి రవితేజ, అకౌంటెంట్ నాగమణి, సీఎంఎం రామలక్ష్మి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రోన్లున్నాయ్.. జాగ్రత్త



తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 15 (టుడే విదుర): దీపావళి నేపథ్యంలో కోడి పందేలు, జూద స్థావరాలపై పోలీసులు డ్రోన్లతో నిఘా పెడుతున్నారు. ప్రధానంగా కోడి పందేల నిర్వాహకులపై దృష్టి సారించిన పోలీసులు ఇప్పటికే పలు ప్రాంతాల్లో డ్రోన్లు వినియోగించి జూదరుల ఆట కట్టించారు. ముఖ్యంగా ఎర్రావారిపాలెం, భాకరాపేట, శ్రీకాళహస్తి, నెరబైలు, తొట్టంబేడు, సత్యవేడు తదితర ప్రాంతాల్లో నిఘా పెంచి పలువురిపై కేసులు నమోదు చేశారు. ఇలా గుర్తించిన స్థావరాలపై ఆకస్మిక దాడులు చేస్తున్నారు. వారం కిందట తిరుపతి నగరం యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలోని జడ్పీ పాఠశాల వెనుక బహిరంగ ప్రదేశంలో జూదం ఆడుతున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడికి సమాచారం అందింది. దీంతో సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్‌ను అప్రమత్తం చేశారు. డీఎస్పీ భక్తవత్సలం, సీఐ రామయ్య, సిబ్బంది కలిసి డ్రోన్లు పంపి ఆ ప్రాంతంలో నిఘా వుంచారు. అక్కడ జూదం ఆడుతున్న 11 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.37 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. గతంలోనూ ఇలా జూద గృహాలు, కోడి పందేలను డ్రోన్ల ద్వారా గుర్తించి.. నిందితులను అరెస్టు చేశారు. సమాచారం వచ్చిన వెంటనే డ్రోన్లను పంపడం ద్వారా శిబిరాల నిర్వాహకులను గుర్తించి వారిపై కఠిన చర్యలకు ఉపక్రమిస్తున్నారు. దీపావళితో పాటు అంతకు ముందు.. తర్వాత కోడి పందేలు, జూదాలు సాగకుండా కట్టడి చేయడానికి సైబర్ క్రైం పోలీసులకు ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. దీంతో నిరంతర తనిఖీలకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. గతంలో నమోదైన కేసులు, స్థావరాలను పరిశీలించి వాటిపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించనున్నారు.

# రైతులు వ్యాపారవేత్తలుగా ఎదగాలి



సాలూరు అక్టోబరు 15 (టుడే విదుర): జిల్లాలోని ప్రతి రైతు ఒక వ్యాపారవేత్తగా ఎదగాలని, ఆ దిశగా అధిక రాబడి వచ్చే పంటలు, వాణిజ్య పంటల వైపు రైతులు మొగ్గుచూపాలని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి పేర్కొన్నారు. అంతర పంటలు వేయడం, ఖాళీగా ఉండే పొలం గట్లపై ఆకుకూరలు, పూలమొక్కలు సాగు చేయడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని సూచించారు. పొలాల్లో అధిక ఆదాయం వచ్చే విత్తనాలు వేయాలని, వరికి బదులుగా అధిక ఆదాయం వచ్చే పంటల దిశగా రైతులకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. రైతులు మఖానా, ఓట్స్, క్వినోవా రైస్, బ్లాక్ రైస్ వంటివి వేసుకోవాలని సూచించారు. ప్రతి పంటపై రైతుకు ఎక్కువ ఆదాయం వచ్చేలా డివిఆర్ తయారు చేయాలని, ప్రతి రైతు వ్యాపారవేత్తగా ఎదిగేలా చొరవ చూపాలని గ్రామ వ్యవసాయ సహాయకులకు కలెక్టర్ దిశా నిర్దేశం జారీచేశారు. మండలంలోని మామిడిపల్లి ప్రాంతాన్ని వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ సందర్శించారు. అనంతరం సాలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ ఏర్పాటుచేసిన రైతులతో ముఖాముఖి లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా సుమారు 67, 000 ఎకరాల్లో సాంప్రదాయ సేద్యం చేస్తున్నామని, అలాగే ఉద్యానవన పంటల్లోనూ మంచి మార్పులు వస్తున్నాయని, ఈ ఏడాది జిల్లా అభివృద్ధిలో వ్యవసాయ, ఉద్యానవన రంగాలు కీలకపాత్ర పోషించనున్నట్లు వివరించారు. గతంలో కంటే ఈ ఏడాది మరింత ఎక్కువ వృద్ధిని మనం చూడబోతున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈసారి మంచిగా వర్షాలు కురవడం వల్ల పంటలు బాగా వచ్చాయని, కావున ఈ ఏడాది జిల్లా మరింత అభివృద్ధిని, ఆదాయాన్ని పొందుతుందని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా రైతులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. సంప్రదాయ పద్ధతుల్లో పంటల్ని పండించడమే కాకుండా అంతర్ పంటలపై కూడా మంచి అవగాహన ఉందని కితాబిచ్చారు. అలాగే పొలంగట్ల మైన కూడా అనేక రకాల కూరగాయల్ని, పూలమొక్కల పంటలను సాగుచేసి ఉన్నతంగా ఆలోచన చేయడం అభినందించదగ్గ విషయమని పేర్కొన్నారు. రైతుకు లాభం చేకూర్చాలంటే వాణిజ్య పంటల గురించి, అధిక రాబడి తెచ్చే పంటలపై అవగాహన ఉండాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖకు సూచించారు. ఇక్కడి పొలాలు అరటి, చెరకు, వరి, మొక్కజొన్న పంటలకు అనుకూలమని, దీన్ని సంప్రదాయ సేద్యం చేయడం ద్వారా మరింత మెరుగైన ఆదాయం ఆర్జించవచ్చని అన్నారు. నాటు చెరకు కాకుండా ఈ కాలానికి తగ్గట్టుగా మేలు రకమైన విత్తనాలు వేయించడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా ఉద్యానవన శాఖాధికారి టి.సంతోష్ కుమార్, సాలూరు ఏడిఏ, ఎఓ, మండల అధికారులు, ఎఎంసి చైర్మన్ ముఖీ సూర్యనారాయణ, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిఎలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# యాత్రికులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు


పాలకొల్లు:అక్టోబరు 15 (టుడే విదుర): కార్తీక మాసంలో ఆలయానికి వచ్చే యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. మంగళవారం స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి దేవస్థాన అధికారులు, ధర్మకర్తల మండలి ఛైర్మన్, సభ్యులతో కార్తీక మాస ఏర్పాట్లపై ఆలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ పంచారామాల్లో ప్రసిద్ధిగాంచిన క్షీరారామ లింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా అపరిశుభ్రత అనే మాట లేకుండా పరిశుభ్రమైన వాతావరణం నెలకొల్పేలా చేయాలన్నారు. స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు. చలువ పందిర్లు, షామియానా ఏర్పాటుతోపాటు ఆలయంకు, రాజగోపురానికి ప్రత్యేక విద్యుత్ అలంకరణ, పువ్వుల అలంకరణలు ప్రత్యేక శ్రద్ధతో చేయాలని సూచించారు. క్యూలైన్లను పక్కాగా ఏర్పాటు చేయడంతోపాటు చిన్నపిల్లలకు పాలు కూడా ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైతే అదనపు పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తొలుత కలెక్టర్‌కు ఆలయ ఇఒ, ధర్మకర్తల మండలి ఛైర్మన్ స్వాగతం పలికారు. ప్రధాన అర్చకులు కిష్టప్ప, అనిల్ కలెక్టర్‌కు తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

# కృష్ణా జలాల పునరుద్ధరణ..



హైదరాబాద్ అక్టోబరు 15 (టుడే విదుర): హైదరాబాద్ మహా నగరానికి తాగునీటి సరఫరా చేసే కృష్ణా ఫేజ్–3 పంపింగ్‌ను అధికారులు పునరుద్ధరించారు. మరమ్మతు పనులు 30 గంటల్లోనే పూర్తి చేసి మధ్యాహ్నానికి రిజర్వాయర్లకు నీటిని పంపింగ్ చేశారు. కోదండాపూర్ నుంచి గొడకొండ్ల వరకు ఉన్న మహానగరానికి మంచినీటిని సరఫరా చేస్తున్న కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లై ప్రాజెక్ట్ (కేడీడబ్ల్యూఎస్పీ) ఫేజ్– 3, పంపింగ్ మెయిన్‌కి సంబంధించి 2375 ఎంఎం డయా పైప్‌లైన్‌కు భారీ నీటి లీకేజీ ఏర్పడింది.అలీకేజీని అరికట్టడంతో పాటు పనిచేయని వాల్వ్‌లను మార్చే పనుల నిమిత్తం ఉదయం నుంచి కృష్ణా ఫేజ్–3 జలాలను నిలిపివేశారు. దాదాపు 36 గంటల పాటు పనులు చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి పర్యవేక్షణలో పగలు, రాత్రి లేకుండా ట్రాన్స్‌మిషన్ విభాగం ఇంజనీర్లు, టెక్నీషియన్లు నిర్విరామంగా పనులు చేశారు. మధ్యాహ్నానికి పనులు పూర్తవ్వడంతో కృష్ణా జలాల పంపింగ్‌ను ప్రారంభించి నగరంలోని ప్రాంతాలకు నీటి సరఫరా చేశారు.

## బొట్టుగూడ పాఠశాలకు కోమటిరెడ్డి ప్రతీక్ పేరు




నల్లగొండ అక్టోబరు 15 (టుడే విదుర): నల్లగొండలో అత్యాధునిక వసతులతో నిర్మితమవుతున్న బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాలకు.. కోమటిరెడ్డి ప్రతీక్ ప్రభుత్వ పాఠశాలగా ప్రభుత్వం నామకరణం చేసింది. ఇందుకు సంబంధించిన జీవోను జారీ చేసింది. బొట్టుగూడ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆ పాఠశాల నూతన భవనానికి శ్రీకారం చుట్టారు. తన కుమారుడు కోమటిరెడ్డి ప్రతీక్ పేరిట ఏర్పాటు చేసిన కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా సుమారు రూ. 8కోట్ల వ్యయంతో భవన నిర్మాణాన్ని చేపట్టారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఉండేలా ఈ నూతన భవనంలో వసతులు కల్పిస్తున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కోమటిరెడ్డి ప్రతీక్ పేరును ఆ పాఠశాలకు ఖరారు చేసింది. ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేసిన మంత్రి కోమటిరెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. జీవో ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి, అందుకు కృషి చేసిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఒకటి లేదా రెండు నెలల్లోపే పాఠశాలను సిద్ధం చేసి ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభిస్తామని మంత్రి కోమటిరెడ్డి ఈ సందర్భంగా వెల్లడించారు. విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించేందుకు కావాల్సిన అన్ని వసతులను పాఠశాలలో ఏర్పాటు చేస్తున్నామని, ఆంగ్ల, ఉర్దూ మీడియంలో బోధనకు ఉపాధ్యాయులను కూడా ప్రతీక్ ఫౌండేషన్ ద్వారానే నియమిస్తామని తెలిపారు. ఇక, వచ్చే మూడేళ్లలో నియోజకవర్గంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను దశలవారీగా ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా అధునాతన సౌకర్యాలతో తీర్చిదిద్దుతామని ఆయన పేర్కొన్నారు.

# డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి...




కరీంనగర్ అక్టోబరు 15 (టుడే విదుర): యువత, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాల నిర్మూలనకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చి దిద్దాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్, ఎక్సైజ్ శాఖ, శిశు సంక్షేమ శాఖ, వైద్య, తదితర శాఖల అధికారులతో జిల్లాస్థాయి నార్కో కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై పాఠశాలలు, కళాశాలల్లో, బహిరంగ ప్రదేశాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్, ఎక్సైజ్, విద్యాధికారులు కలిసి రోడ్ల పక్కన పాఠశాలలు, పాన్ షాపుల్లో తనిఖీలు చేయాలన్నారు. విద్యార్థుల ప్రవర్తనను నిత్యం గమనించాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు సూచించారు. అవగాహన కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ మత్తు పదార్థాలతో కలిగే దుష్పరిణామాలపై ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించాలన్నారు. సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ.. మత్తు పదార్థాల నిర్మూలనకు నిత్యం గస్తీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు హాస్టళ్లు, ఆర్టీసీ కార్గో, ప్రైవేట్ పార్సిల్ సంస్థలతోపాటు ఆన్‌లైన్ సంస్థలకు సంబంధించి గోదాములను తనిఖీ చేస్తున్నామన్నారు. మాదక ద్రవ్యాలు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం నశా ముక్త్‌భారత్ అభియాన్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రమేష్‌బాబు, డీడబ్ల్యూవో సరస్వతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భారీగా నగదు, మద్యం పట్టివేత..

# కుక్కర్లు, చీరలు, ల్యాప్‌టాప్?లూ గుర్తింపు



**- ఎన్నికల ప్రత్యేక బృందాల తనిఖీల్లో స్వాధీనం**
**- కోడ్ ఉల్లంఘనపై మూడు కేసులు - ఫిర్యాదు చేసిన ఐదు నిమిషాల్లో స్పందన**

హైదరాబాద్ అక్టోబరు 15 (టుడే విదుర): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక బృందాలు, పోలీసుల తనిఖీల్లో నగదు, మద్యంతో పాటు ఉచితంగా పంపిణీ చేసే కానుకలూ పట్టుబడుతున్నాయి. అత్యల్పంగా డ్రగ్స్ కూడా పట్టుకున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు సంబంధించి మూడు కేసులు నమోదయ్యాయి. ఈ నెల 6వ తేదీన ఎన్నికల కోడ్ అమలులోకి రాగా, ఇప్పటి వరకు రూ. 88,45,200 నగదు, 255.56 లీటర్ల మద్యం, 0.77 గ్రాముల డ్రగ్స్, ఉచితంగా పంపిణీ చేసేందుకు తీసుకెళ్తోన్న రూ. 72,740 విలువైన కానుకలు స్వాధీనం చేసుకున్నారు. నగదులో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు రూ. 12.90 లక్షలు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు రూ. 45.72 లక్షలు, పోలీసులు రూ. 29.82 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా తరలిస్తున్న 251.96 లీటర్ల మద్యాన్ని పోలీసులు, 3.6 లీటర్ల మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. సరైన పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న కుక్కర్లు, చీరలు, ల్యాప్‌టాపలను కూడా స్వాధీనం చేసుకున్నారు. మద్యం అక్రమ తరలింపుపై 21 కేసులు, నగదుకు సంబంధించి 19, కానుకల పంపిణీకి సంబంధించి 2, కోడ్ ఉల్లంఘనపై మూడు, డ్రగ్స్ తరలింపుపై మూడు కేసులు నమోదు చేశారు. ఆయా ఉల్లంఘనలకు సంబంధించి 48 కేసులు నమోదయ్యాయి.

# పంటల కొనుగోళ్లకు వేళాయె!



హైదరాబాద్, అక్టోబరు 15 (టుడే విదుర): రాష్ట్రంలో వానాకాలంలో రైతులు పండించిన పంటల సేకరణ మొదలైంది. మూడు ప్రధాన పంటలైన వరి, పత్తి, మొక్కజొన్నల సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ నోడల్ ఏజెన్సీ అయిన మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి మక్కల కొనుగోళ్లకు శ్రీకారం చుడుతోంది. ధాన్యం సేకరణ 6 జిల్లాల్లో ప్రారంభం కాగా.. నవంబరు నాటికి వేగం పుంజుకోనుంది. ఇక భారత పత్తి సంస్థ(సీసీఐ) దీపావళి పండగ మరుసటి రోజు నుంచి రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లను ప్రారంభించనుంది. వానాకాలం సీజన్‌లో రాష్ట్రంలో 68 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా.. కోటిన్నర లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అధికారులు అంచనా వేశారు. రూ. 21,112 కోట్లు సమీకరించి.. 80 లక్షల టన్నుల ధాన్యం సేకరణకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ నెల 1 నుంచి రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లకు శ్రీకారం చుట్టింది. నిజామాబాద్, కామారెడ్డి, నల్లగొండ, సిరిసిల్ల, భువనగిరి, సిద్దిపేట జిల్లాల్లో ప్రస్తుతం ధాన్యం సేకరణ చేపట్టారు. మరో పక్షం రోజుల్లో ధాన్యం సేరకణ జోరందుకోనుంది. 21 నుంచి పత్తి కొనుగోళ్లు ఈ నెల 21 నుంచి రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, సీసీఐ ఏర్పాట్లు చేస్తోంది. జాబ్ వర్క్ టెండర్లలో జిన్నింగ్ మిల్లర్లు తొలుత పాల్గొనకపోవడం, ఆ తర్వాత మంత్రి తుమ్మల చర్చలు జరపడంతో సమస్య తొలగిపోయింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 328 జిన్నింగ్ మిల్లుల్లో దీపావళి తర్వాత నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభించనున్నారు. 43.29లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగుచేయగా.. 24.70లక్షల టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని అధికారులు అంచనా వేశారు. 'కపాస్ కిసాన్' యాప్ ద్వారా నమోదు చేసుకొన్న రైతులే పత్తి విక్రయించేలా సీసీఐ ఏర్పాట్లు చేసింది.

# పెట్టుబడి 2 లక్షలు.. ఆదాయం 21 వేలు



రాజోలి, అక్టోబరు 15(టుడే విదుర): తల్లి వంటి ఉల్లి పంటను ఆరుగాలం కష్టపడి సాగు చేస్తే.. గిట్టుబాటు ధర లేక పంట పొలంలోనే ప్రజలకొదిలేసిన దీన రైతు గాథ జోగుళాంబ–గద్వాల జిల్లా రాజోలి మండల కేంద్రంలో జరిగింది. రాజోలి గ్రామ రైతు శేఖర్.. రెండెకరాల భూమి కౌలుకు తీసుకుని.. రూ. 2 లక్షల పెట్టుబడితో ఉల్లి పంట సాగు చేశాడు 70 క్వింటాళ్ల దిగుబడితో లాభం వస్తుందనుకున్న శేఖర్ ఆశ అడియాసగా మిగిలింది. మార్కెట్‌లో క్వింటాల్ ఉల్లి ధర రూ. 300 పలుకుతోంది. దీని ప్రకారం మొత్తం అమ్మినా రూ. 21 వేల రాబడి రాదు. దీనికి తోడు ఉల్లిగడ్డలను తవ్వి, కోయడానికి కూలీల ఖర్చు, మార్కెట్‌కు రవాణా ఖర్చు అదనం. దీంతో కూలీలను ఏర్పాటు చేయలేక.. పంట అమ్ముకుని నష్టాల పాలు కాలేక పొలంలోనే వదిలేసుకున్నాడు. అంతటితో ఆగక.. తన పొలంలో ఉల్లిగడ్డలున్నాయని, కావాల్సిన వారు ఉచితంగా తీసుకెళ్లొచ్చని రాజోలి, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు చెప్పాడు. దీంతో ప్రజలు, స్థానిక వ్యాపారులు సంచులతో పొలంలోకి ఎగబడ్డారు. కొందరు 2,3 సంచుల్లో ఉల్లి గడ్డలు నింపుకుని సంతోషంగా వెళ్లారు. మరి కొందరు మోటారు సైకిళ్లు, ఆటోల్లో తరలించుకుని వెళితే.. ఒక కూరగాయల వ్యాపారి ఏకంగా ట్రాక్టర్ లోడ్ తీసుకెళ్లడం గ్రామంలో చర్చనీయాంశమైంది. తన పంట వృథా కాకూడదని, ఉచితంగా ప్రజలను తీసుకెళ్లాలని చెప్పిన రైతు శేఖర్ మనస్సు ఎంతో గొప్పదని గ్రామస్తులు అభిప్రాయ పడ్డా

# బాలికలు విద్యావంతులుగా ఎదగాలి

సిరిసిల్ల అక్టోబరు 15 (టుడే విదుర): బాలికలు సురక్షితంగా విద్యావంతులుగా ఎదగాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షు రాలు బీ పుష్పలత అన్నారు. జిల్లా కేంద్రం లోని కుసుమ రామయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగ ణంలో జిల్లా న్యాయ సేవాధికర సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవంను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షు రాలు బీ పుష్పలత మాట్లాడారు. బాలికలు సురక్షితంగా విద్యావంతులుగా స్వయం సమర్థులుగా ఎదగడానికి సమాజంలోని ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. సమాజంలో ప్రతి బాలిక గౌరవంగా జీవించే హక్కు కలిగి ఉందన్నారు. చట్టాలపై ప్రతి మహిళ అవగాహన పెంచు కోవాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన కార్య దర్శి రాధిక జైస్వాల్ మాట్లాడుతూ వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలకు సంబంధించిన బహుమతులు జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ, తెలంగాణ రాష్ట్ర లీగల సర్వీసెస్ అథారిటీ ఏఈజీఐఎస్ కింద స్పాన్సర్ చేయబడిందన్నారు. అనంతరం జిల్లా న్యాయసేధికార సంస్థ ఆధ్వర్యం లో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటిలలో విజేతలైన విద్యార్థులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాల బీ పుష్పలత బహుమతులను అందజేసి అభినందించారు.

# సినిమా



## తమిళంలో దీపావళికి యంగ్ హీరోస్ మధ్య వార్...




ఒకప్పుడు దీపావళి అంటే అగ్ర కథానాయకుల చిత్రాలతో థియేటర్లు కళకళలాడేవి. కానీ ఇప్పుడు మాత్రం యంగ్ హీరోస్ సినిమాలే దీపావళి బరిలో నిలుస్తున్నాయి. ఇక తమిళనాడు విషయానికి వస్తే ఈ యేడాది దీపావళి కానుకగా అక్టోబర్ 17న ఏకంగా ఐదు సినిమాలు సందడి చేయబోతున్నాయి. అయితే ఇందులో ప్రధానమైన పోటీ మూడు చిత్రాల మధ్యే ఉండబోతోంది.

యువ దర్శకుడు ప్రదీప్ రంగనాథన్ ఇప్పుడు హీరోగానూ రాణిస్తున్నాడు. 'లవ్ టుడే' మూవీ తర్వాత అతను నటించిన 'డ్రాగన్' మూవీ కూడా హిట్ కావడంతో ఇప్పుడు అందరి దృష్టి అతని తాజా చిత్రం 'డ్యూడ్'మీదే ఉంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ సినిమా తమిళంతో పాటు తెలుగులోనూ విడుదల అవుతోంది. మమితా బైజు హీరోయిన్ గా నటించిన ఈ మూవీలో శరత్ కుమార్ కీలక పాత్రను పోషించాడు. సాయి అభ్యంకర్ ఈ సినిమాకు సంగీతం అందించాడు. కీర్తిశ్వర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాకు యు/ఎ సర్టిఫికెట్ లభించింది. ఈ సినిమా నిడివి రెండు గంటల ఇరవై నిమిషాలు. చిత్రం ఏమంటే ఈ సినిమాతో పాటే ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటించిన మరో సినిమా 'ఎల్.ఐ.సి.'ని కూడా దీపావళికి బరిలో దింపుతామని మొదట అన్నారు. అయితే ఆ తర్వాత ఆ చిత్రం డిసెంబర్ కు వాయిదా పడింది.ఇక దీపావళికి వస్తున్న మరో సినిమా విక్రమ్ తనయుడు ధృవ్ నటించి 'బైసన్'. కబడీ నేపథ్యంలో రూపుదిద్దుకున్న ఈ స్పోర్ట్స్ డ్రామాలో అనుపమా పరమేశ్వరన్ రజీషా విజయన్ హీరోయిన్లుగా నటించారు. నివాస్ కె ప్రసన్న దీనికి సంగీతం సమకూర్చాడు. ప్రముఖ దర్శకుడు మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా నిడివి కాస్తంత ఎక్కువే. దీని రన్ టైమ్ రెండు గంటల నలభై ఎనిమిది నిమిషాలు.ఇదే వరుసలో రాబోతున్న మూడో చిత్రం 'డీజిల్' . హరీశ్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న ఈ సినిమా అతుల్య రవి హీరోయిన్. షణ్ముగమ్ ముత్తుసామి దీనికి దర్శకుడు. ధీబు నైనన్ థామస్ సంగీతం సమకూర్చిన ఈ సినిమా యాక్షన్ ప్యాక్డ్ మూవీకి యు/ఎ సర్టిఫికెట్ లభించింది. దీని రన్ టైమ్ రెండు గంటల 24 నిమిషాలు. ఈ మూడు సినిమాలు కాకుండా అక్టోబర్ 17వ తేదీనే సముతిరకని, గౌతమ్ వాసుదేవ మీనన్ నటించిన 'కర్మణి సెల్వమ్' , నట్టి నటరాజ్ నటించిన 'కంబి కట్న కథ' సినిమాలు వస్తున్నాయి. మరి ఐదు సినిమాలలో వేటికి ప్రేక్షకాదరణ లభిస్తుందో చూడాలి.

## కొడుకు హీరోగా విజయ భాస్కర్ మూడో సినిమా...



ప్రముఖ దర్శకుడు విజయ్ భాస్కర్ తనయుడు శ్రీకమల్ ప్రస్తుతం తెలుగులో హీరోగా నటిస్తున్నాడు. అతని తొలి చిత్రం 'జిలేబీ' 2023లో విడుదలైంది. విశేషం ఏమంటే... ఈ సినిమాను విజయ్ భాస్కరే డైరెక్ట్ చేశారు. జీవిత, రాజశేఖర్ కుమార్తె శివానీ ఇందులో హీరోయిన్. గుంటూరు రామకృష్ణ, అంజు అస్రాని ఈ సినిమా నిర్మించారు. ఇది మలయాళ చిత్రం 'అది కప్యారే కూటమణి' సినిమాకు రీమేక్. అయితే ఈ సినిమా విడుదల సమయంలో ఇక్కట్లు పడ్డారు నిర్మాతలు. తన కొడుకు నటించిన తొలి చిత్రం విడుదలకు సమస్యలు రావడంతో విజయ్ భాస్కర్ అతనితో రెండో సినిమా చేస్తూ దాన్ని ఆయనే నిర్మించారు. అదే 'ఉషా పరిణయం' శ్రీకమల్ ఫస్ట్ మూవీ 'జిలేబీ' 2023 ఆగస్ట్ నెలాఖరులో విడుదలైతే, సరిగ్గా యేడాది తర్వాత అదే ఆగస్ట్ నెలలో 'ఉషా పరిణయం' మూవీ రిలీజ్ అయ్యింది. ఈ సినిమా కూడా ఆశించిన స్థాయిలో ఆడలేదు. ఈ మూవీతో తన్వీ ఆకాంక్ష హీరోయిన్ గా పరిచయం అయ్యింది. ఈ సినిమాను తాము క్వాలిటీతో తీసినా... విడుదల సమయంలో అనుకోని సమస్యలు ఎదురయ్యాయని, వేరే సినిమాలతో పోటీ పడటం ఇష్టం లేక తాము తమ చిత్రాన్ని వాయిదా వేసుకుంటే... అదే రోజుకు మరో పది, పన్నెండు సినిమాలు వచ్చేయని దర్శక నిర్మాత విజయ భాస్కర్ తెలిపారు.

## శర్వాతోనే శ్రీను వైట్ల సినిమా



శ్రీను వైట్ల ఒకప్పుడు తెలుగులో క్రేజీయెస్ట్ డైరెక్టర్. యువ కథానాయకులతోనే కాదు స్టార్ హీరోలతోనూ సినిమాలు చేసి తన సత్తాను చాటుకున్నారు. శ్రీను వైట్ల దర్శకత్వం వహించిన కొన్ని సినిమాలు బ్లాక్ బస్టర్ సక్సెస్ ను అందుకున్నాయి. అయితే... 2011లో వచ్చిన 'దూకుడు' తర్వాత మళ్ళీ శ్రీను వైట్ల ఆ స్థాయి విజయాన్ని అందుకోలేకపోయారు. అంతేకాదు... 2018లో వచ్చిన 'అమర్ అక్బర్ ఆంథోని' సినిమా తర్వాత ఆయన ఏకంగా ఐదేళ్ళు దర్శకత్వానికి దూరంగా ఉండాల్సి వచ్చింది. ఇక గత యేడాది 'విశ్వం' సినిమాతో మళ్ళీ లైమ్ లైట్ లోకి వచ్చిన శ్రీను వైట్ల... ఆ తర్వాత ఎట్టకేలకు ఓ ప్రాజెక్ట్ ను సెట్ చేయగలిగాడు.'ఢీ' సినిమా తర్వాత దానికి సీక్వెల్ గా మంచు విష్ణుతోనే శ్రీను వైట్ల సినిమా చేస్తాడనే ప్రకటన వచ్చింది. కానీ అది పట్టాలెక్కలేదు. ఈ లోగా గోపీచంద్ హీరోగా 'విశ్వం' సినిమాను శ్రీను వైట్ల తెరకెక్కించాడు. ఇది థియేటర్లలో పెద్దంత ఆడకపోయినా... ఓటీటీలో బాగానే వీక్షకులను మెప్పించింది. అప్పటి నుండి మరో సినిమాను సెట్ చేసే పనిలో శ్రీను వైట్ల ఉన్నాడు. ఆ మధ్య నితిన్ హీరోగా శ్రీను వైట్ల ఓ సినిమా చేయబోతున్నాడనే ప్రచారం జరిగింది. అయితే ఇప్పుడు శర్వానంద్ తో శ్రీను వైట్ల ప్రాజెక్ట్ లాక్ అయ్యిందని తెలుస్తోంది. 'విశ్వం'కు రచన చేసిన నందు ఈ సినిమాకూ వర్క్ చేస్తున్నాడని అంటున్నారు. శ్రీను వైట్ల చెప్పిన కథ నచ్చడంతో శర్వానంద్ ఈ సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడట. దాంతో మిగిలిన నటీనటులు, టెక్నీషియన్స్ ను సెట్ చేసే పనిలో శ్రీను వైట్ల ఉన్నాడట.

## మహాభారత్ కర్ణుడి కన్నుమూత




ప్రముఖ దర్శక, నిర్మాత బి.ఆర్. చోప్రా తెరకెక్కించిన బుల్లితెర ధారావాహిక 'మహాభారత్' లో కర్ణుడి పాత్రను పోషించిన పంకజ్ ధీర్ (68) కాన్సర్ తో బుధవారం కన్నుమూశారు. భారతీయ టెలివిజన్ రంగంలో పంకజ్ ధీర్ కు మంచి గుర్తింపు ఉంది. 'మహాభారత్' సీరియల్ లో కర్ణుడి పాత్రతో ప్రతి ఒక్కరికీ చేరువైన పంకజ్ 'మహా భారత్' తర్వాత 'చంద్రకాంత, ది గ్రేట్ మరాఠా, యుగ్, బధో బాహు'లో నటించారు. అలానే హిందీ చిత్రాలు 'సడక్, సోల్జర్, బాద్ షా' లో యాక్ట్ చేశారు. నటుడిగానే కాకుండా సినిమా రంగంలో ఎంటర్ పెన్యూర్ గానూ తన సత్తా చాటే ప్రయత్నం చేశారు పంకజ్ ధీర్. 2006లో ముంబైలోని జోగేశ్వరి లో తన సోదరుడు సట్లుజ్ ధీర్ తో కలిసి విశగే స్టూడియోజ్ ను ఏర్పాటు చేశారు. అలానే 2010లో మహాభారత్ లోని తన తోటి నటుడు గుఫీ పెయింటర్ తో కలిసి అభినయ్ యాక్టింగ్ అకాడమిని ప్రారంభించారు. పంకజ్ ధీర్ కుమారుడు నికితిన్ ధీర్ కూడా నటుడే కావడం విశేషం. అతను 'చెన్నయ్ ఎక్స్ ప్రెస్, షేర్షా ' వంటి చిత్రాలలో నటించాడు. టీవీ నటి క్రతికా సెంగర్ ను వివాహం చేసుకున్నాడు.

## గాయని బాల సరస్వతి కన్నుమూత



హైదరాబాద్, అక్టోబర్ 15: తెలుగులో తొలి నేపథ్య గాయని బాల సరస్వతి(97) మృతి చెందారు. హైదరాబాద్‌లో ఈ రోజు ఉదయం తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆరేళ్ల వయసు ఉన్నప్పటినుంచే బాల సరస్వతి పాటలు పాడడం మొదలుపెట్టారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీతో పాటు పలు భాషల్లో మొత్తం 2000కి పైగా ఆమె పాటలు పాడారు. లలిత సంగీత దిగ్గజంగా పేరుందిన బాల సరస్వతి దేవి 1939లో మహానంద సినిమాతో తెలుగులో తొలి నేపథ్య గాయనిగా గుర్తింపు పొందారు. ఆకాశవాణి కార్యక్రమంతో తెలుగు వారికి పరిచయమైన బాల సరస్వతి.. 'సతీ అనసూయ' సినిమాలో తొలి పాటను పాడారు. తెలుగు చిత్ర పరిశ్రమ తొలి దశలో అనేక మధుర గీతాలు ఆలపించారు. తెలుగు, తమిళ సినిమాల్లో 1930 నుంచి 1960 వరకు పాటలు పాడటంతో పాటు పలు చిత్రాల్లో ఆమె నటించి మెప్పించారు.

## తెలుగులో రీఎంట్రీ కోసం ఎదురుచూస్తున్న రకుల్!

2011లో 'కెరటం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన నటి రకుల్ ప్రీత్ సింగ్. తర్వాత 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్'తో హిట్ అందుకుని స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. 2021లో 'కొండపొలం' తర్వాత తెలుగులో కనిపించని ఆమె, ప్రస్తుతం తమిళ, హిందీ సినిమాల్లో నటిస్తోంది. బాలీవుడ్‌లో 'మేరీ హస్బెండ్ కి బీవీ'తో పాటు 'దే దే ప్యార్ దే' సీక్వెల్‌లోనూ నటిస్తోంది. ఈలోగా, ఆమె సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోలతో అభిమానులను ఆకట్టుకుంటోంది.




# క్రీడావార్తలు




## ఉమెన్స్ వరల్డ్ కప్ 2025.. టీమిండియాకు గోల్డెన్ ఛాన్స్!




మనం ఎన్ని తప్పులు చేసినా.. దేవుడు ఏదో ఒక రూపంలో మరో అవకాశం ఇస్తాడని చాలా మంది అంటుంటారు. అది ఏ రంగమైనా సరే, ఏ విషయంలో అయినా సరే. అలా వచ్చే లక్కీ ఛాన్స్ ను సరిగ్గా వినియోగించుకుంటే.. విజేతలుగా నిలవచ్చు. అలానే వరుణుడు భారత్ కు ఓ మంచి అవకాశం ఇచ్చాడు. ఇంకా చెప్పాలంటే.. సెమీస్ విషయంలో క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న భారత్ కు వాన దేవుడు గోల్డెన్ ఛాన్స్ ఇచ్చారనే చెప్పొచ్చు. మరి.. ఈ వర్షం, లక్కీ ఛాన్స్ ఏంటి అనే కదా మీ సందేహం. ఆ వివరాలు ఇప్పుడు చూద్దాం..ఐసీసీ మహిళల ప్రపంచ కప్ 2025లో శ్రీలంక, న్యూజిలాండ్ మహిళల జట్ల మధ్య మంగళవారం జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా అర్ధాంతరంగా ఆగిపోయింది. ఆర్ ప్రేమ దాస్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆతిథ్య శ్రీలంక ఆరు వికెట్ల నష్టానికి 258 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. అయితే న్యూజిలాండ్ టార్గెట్‌ను ఛేదించేందుకు బ్యాటింగ్ దిగక ముందే వర్షం ప్రారంభమైంది. ఆ తర్వాత మ్యాచ్ తిరిగి ప్రారంభం కాలేదు. దీంతో ఇరు జట్లు చెరో పాయింట్ తీసుకుని సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ మ్యాచ్ ఫలితం టీమిండియాకు లాభాన్ని చేకూర్చిందని క్రికెట్ నిపుణులు చెబుతున్నారు. నాలుగు మ్యాచ్‌లలో రెండు పాయింట్లతో శ్రీలంక ఏడో స్థానంలో ఉండగా.. న్యూజిలాండ్ మూడు పాయింట్లతో పట్టికలో ఐదో స్థానంలో ఉంది. ఇక్కడ శ్రీలంకకు పెద్ద నష్టం జరగనప్పటికీ.. సెమీస్ అవకాశాలను మెరుగుపర్చుకోవాలని భావించిన కివీస్‌కు మాత్రం ఈ మ్యాచ్ రద్దు పెద్ద ఎదురు దెబ్బే అని చెప్పాలి. న్యూజిలాండ్ జట్టు ఇప్పటికే రెండు పరాజయాలను చవిచూసింది. తాజాగా మ్యాచ్ రద్దుతో సెమీ-ఫైనల్ రేసు మరింత కష్టమైంది. మరోవైపు మ్యాచ్ రద్దు కావడం భారత జట్టుకు మేలు చేసింది. భారత్ ఇప్పుడు మిగిలిన మూడు మ్యాచ్ లు గెలిస్తే.. గరిష్టంగా 10 పాయింట్ల వరకు చేరుకోగలదు. అయితే న్యూజిలాండ్‌జట్టు మిగిలిన మ్యాచులు గెలిచి 9 పాయింట్ల వరకు చేరుకునే అవకాశం ఉంది. అక్టోబర్ 23న భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య కూడా మ్యాచ్ జరగాల్సి ఉంది. ఆ మ్యాచ్‌లో భారత్ విజయం సాధిస్తే సెమీఫైనల్లో స్థానం దాదాపు ఖాయం చేసుకుంటుందని క్రీడా విశ్లేషకులు చెబుతున్నారు. మొత్తంగా సంక్లిష్టంగా మారిన భారత్ సెమీస్ ఆశలను సులభం చేసుకునేందుకు వాన రూపంలో ఈ మంచి ఛాన్స్ వచ్చిందనే చెప్పొచ్చు. అయితే ఈ అవకాశాన్ని టీమిండియా ఎంత వరకు సద్వినియోగం చేసుకుంటుందనేది తెలియాలి అంటే మరికొన్ని రోజుల ఆగాల్సిందే.




ఆసియా కప్ 2025 ట్రోఫీ గెలుపు, వెస్టిండీస్ పై టెస్టు సిరీస్ క్లీన్ స్వీప్ తో భారత్ మంచి జోష్ లో ఉంది. ఇక ఆస్ట్రేలియాలో జరిగే వన్డే, టీ20 సిరీస్ లను భారత్ గెలవాలని పట్టుదలతో ఉంది. అది అంత ఈజీ కాకపోయినా ప్రస్తుతం టీమిండియా ఉన్న ఫామ్ చూస్తే..సాధ్యం కావచ్చు అనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇలా ఆసీస్‌తో జరగబోయే కీలకమైన టీ20 సిరీస్‌కు టీమిండియా సన్నద్ధమవుతున్న సమయంలో భారత్ కు బిగ్ షాక్ తగిలింది.

టీమిండియా ఆల్‌రౌండర్ శివమ్ దూబే గాయం కావడంతో క్రికెట్ ఫ్యాన్స్‌తో ఆందోళన వ్యక్తమవుతుంది. అక్టోబర్ 29 నుంచి ప్రారంభం కానున్న టీ20 సిరీస్‌కు కొన్ని రోజుల ముందు ఈ స్టార్ ఆటగాడు గాయంతో ఇబ్బంది పడటం.. జట్టు వ్యూహాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. శివమ్ దూబే వెన్ను నొప్పి సమస్యతో బాధపడుతున్నాడని సమాచారం. రంజీ ట్రోఫీ 2025లో భాగంగా ముంబై జట్టు జమ్మూ కాశ్మీర్‌తో శ్రీనగర్‌లో ఆడే తొలి మ్యాచ్‌కు కూడా శివమ్ దూబే అందుబాటు ఉండటం లేదు. వాస్తవానికి రంజీ మ్యాచ్ కోసం ముంబై జట్టుతో కలిసి దూబే శ్రీనగర్‌కు వెళ్లాడు. అయితే అక్కడి తీవ్రమైన చల్లని వాతావరణం దూబే వెన్నునొప్పి వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో వైద్య బృందం వెంటనే విశ్రాంతి తీసుకోవాలని సలహా ఇవ్వడంతో దూబే ముంబైకి తిరిగి వచ్చినట్లు ముంబై క్రికెట్ అసోసియేషన్ వర్గాలు ధ్రువీకరించాయి.

## మా వాడికి ఆ క్రికెటర్ అంటే పిచ్చి: కరీనా కపూర్



బాలీవుడ్ నటి కరీనా కపూర్ గురించి సినీ ప్రియులకు ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. అనేక సినిమాల్లో నటించి మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించింది. విభిన్న క్యారెక్టర్లు చేయడంలో కరీనా కపూర్ ఎప్పుడూ ముందు ఉంటుంది. ఇక సైఫ్ అలీఖాన్ తో వివాహం అనంతరం సినిమాలకు విరామం ఇచ్చింది. వారిద్దరికి ఓ కొడుకు జన్మించాడు. ఇది ఇలా ఉంటే..కరీనా కపూర్..టీమిండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది.

తాజాగా తన ఆడపడుచు, భర్త సైఫ్ అలీ ఖాన్ సోదరి సోహా అలీ ఖాన్ నిర్వహించిన పాడ్‌కాస్ట్‌లో కరీనా కపూర్ పాల్గొంది. ఈ క్రమంలో తన కుమారుడు తైమూర్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకుంది. తైమూర్‌కు నటనపై ఏ మాత్రం ఆసక్తి లేదని స్పష్టం చేసింది. ఇదే సమయంలో విరాట్ కోహ్లీఅంటే తన కొడుకు తైమూర్‌కు పిచ్చి అని ఈ బాలీవుడ్ బ్యూటీ తెలిపింది. ఎప్పుడూ కోహ్లీ గురించే అడుగుతాడని, అతని ఫోన్ నంబర్ ఉందా? అని ప్రశ్నిస్తుంటాడని ఆమె చెప్పుకొచ్చింది. సినిమా స్టార్లు, నటనపై తైమూర్ ఏ మాత్రం ఆసక్తి చూపడని, కానీ కోహ్లీ, రోహిత్, లియోనల్ మెస్సీల గురించి మాత్రం తరచూ అడుగుతుంటాడని కరీనా కపూర్ వెల్లడించింది. ఇక కరీనా కపూర్ చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ కాగా నెటిజన్లు భిన్నమైన కామెంట్స్ చేశారు. జీన్స్ ఎక్కడి పోతాయని, తాతా మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ వారసత్వాన్ని తైమూర్ కొనసాగిస్తాడేమోనని వారి అభిమానులు కామెంట్ చేస్తున్నారు. సైఫ్ అలీ ఖాన్ తండ్రి మన్సూర్ అలీ ఖాన్ టీమిండియా మాజీ కెప్టెన్ అన్న సంగతి అందరికీ తెలిసిందే.

## హెచ్‌సీఏపై ఫిర్యాదుల వెల్లువ.. నకిలీ ధ్రువపత్రాలతో లీగ్‌లలోకి పలువురి ఎంట్రీ..




హైదరాబాద్: నిత్యం ఏదొక వివాదానికి కేంద్రంగా ఉండే హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఈసారి క్రికెటర్ల ఎంపికలో జరుగుతున్న అవకతవకలతో బజారున పడింది. మంగళవారం కె.అనంతారెడ్డి, రామారావు ఉప్పల్ పోలీసు స్టేషన్(%ఖజూజూఖశ్రీ ్రాశీశ్రీఱషవ శ్ీ‌ఞఱశీఅ%)లో ఫిర్యాదు చేయగా, పది రోజుల కిందట రాచకొండ కమిషనరేట్‌లో రాష్ట్ర గనుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఎ.అనిల్‌కుమార్ చేసిన ఫిర్యాదు కూడా తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇటీవల హెచ్‌సీఏ ప్రకటించిన అండర్-19 వినూ మన్కడ్ ట్రోఫీకి ఆడే జట్టులో.. నిర్దిష్ట వయసు మించిన వారు, స్థానికేతరులు, తప్పుడు జనన ధ్రువీకరణ పత్రాలు, నకిలీ స్థానికత గల పత్రాలు సమర్పించి, అడ్డదారిలో హెచ్‌సీఏ లీగ్స్ ఆడుతున్నారని వీరు ఆరోపించారు. హెచ్‌సీఏ సెలెక్టర్లలో కొందరు తమ సొంత అకాడమీల్లోని క్రికెటర్లను ఎంపిక చేస్తూ ఇతరులకు అన్యాయం చేస్తున్నారని విమర్శలు చెలరేగుతున్నాయి. ఇంత తతంగం జరుగుతున్నా హెచ్‌సీఏ ఉపాధ్యక్షుడు దల్జీత్ సింగ్, జాయింట్ సెక్రటరీ బసవరాజు చోద్యం చూస్తుండడంపై హెచ్‌సీఏ సభ్యులు కూడా మండిపడుతున్నారు. ద్వంద, నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలతో కొందరు క్రికెటర్లు అడ్డదారిలో హెచ్‌సీఏ లీగ్‌ల్లో ఆడుతూ రాష్ట్ర జట్లలో స్థానం సంపాదిస్తున్నారని ఇద్దరు క్రికెటర్ల తల్లిదండ్రులు రాచకొండ పోలీసులను ఆశ్రయించారు. గత ఏడాది కూడా కొందరు క్రికెటర్లపై ఇలాంటి ఫిర్యాదులే రావడంతో ఆరుగురిపై హెచ్‌సీఏ నిషేధం విధించింది. ఈసారి సుమారు 38 మంది క్రికెటర్లు ఇదే కోవలో తప్పుడు పత్రాలతో హెచ్‌సీఏ లీగ్‌ల్లో ఆడుతున్నారని అనంతారెడ్డి, రామారావు తమ ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. ఆ క్రికెటర్ల జాబితాపై విచారణ జరపాలని కోరారు. వీరికి సహకరిస్తున్న హెచ్‌సీఏలోని పెద్దలపై కూడా కేసులు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## తొలి గంటలోనే



న్యూఢిల్లీ: వెస్టిండీసపై తమ ఆధిపత్యాన్ని భారత జట్టు మరోసారి చాటుకుంది. నాలుగో రోజే ఫలితం తేలిపోయిన రెండో టెస్టులో మంగళవారం గిల్ సేన ఏడు వికెట్ల తేడాతో తమ గెలుపు లాంఛనాన్ని పూర్తి చేసింది. దీంతోపాటు ఈ రెండు టెస్టుల సిరీసను 2-0తో క్లీన్‌స్వీప చేసింది. అలాగే వరల్డ్ టెస్టు చాంపియన్‌షిపలో భాగంగా 12 పాయింట్లను ఖాతాలో వేసుకుని, పట్టికలో ఆసీస్, శ్రీలంక తర్వాత భారత్ మూడో స్థానంలో నిలిచింది. మరోవైపు విండీసపై భారత్‌కిది రికార్డు స్థాయిలో వరుసగా పదో టెస్టు సిరీస్ విజయం కావడం విశేషం. 121 పరుగుల ఛేదన కోసం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ 35.2 ఓవర్లలో 124/3 స్కోరుతో గెలిచింది. కేఎల్ రాహుల్ (58 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో రాణించాడు. చేజ్‌కు రెండు వికెట్లు దక్కాయి. అయితే ఫాలోఆన్ ఆడినప్పటికీ విండీస్ చూపిన తెగువ క్రీడాభిమానులను ఆకట్టుకుంది. తొలి ఇన్నింగ్స్‌ను భారత్ 518/5 స్కోరు వద్ద డిక్లేర్ చేయగా.. విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 248, ఫాలో ఆన్ ఆడుతూ రెండో ఇన్నింగ్స్‌లో 390 రన్స్ చేసింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా కుల్దీప్, ప్లేయర్ ఆఫ్ ద సిరీసగా జడేజా నిలిచారు. 17.2 ఓవర్లలోనే..: 63/1 స్కోరుతో నిలిచిన భారత్ ఆఖరి రోజు 17.2 ఓవర్లలోనే మ్యాచ్‌ను ముగించింది. విజయానికి మరో 58 పరుగుల కోసం బరిలోకి దిగగా క్రీజులో ఉన్న రాహుల్, సుదర్శన్ ఆటను పూర్తి చేస్తారని అంతా భావించినా.. విండీస్ బౌలర్లు మరో రెండు వికెట్లను పడగొట్టగలిగారు. పియెర్ ఓవర్‌లో రాహుల్ 6,4తో వేగం చూపినా.. తర్వాతి ఓవర్‌లోనే సుదర్శన్‌ను చేజ్ అవుట్ చేశాడు. దీంతో రెండో వికెట్‌కు 79 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక వేగంగా మ్యాచ్‌ను ముగించే క్రమంలో గిల్ 33వ ఓవర్‌లో 6,4 బాదినప్పటికీ అదే ఓవర్‌లో చేజ్‌కే దొరికిపోయాడు. కానీ ఆ తర్వాత మరో 14 బంతుల్లోనే రాహుల్, జురెల్ (6 నాటౌట్) మ్యాచ్‌ను ముగించారు.

## బీసీసీఐ నిర్ణయంపై మహ్మద్ షమీ ఘాటు వ్యాఖ్యలు..




ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌కు తనను ఎంపిక చేయకపోవడంపై టీమిండియా స్టార్ పేసర్ మహ్మద్ షమీ అసంతృప్తి వ్యక్తం చేశారు. అక్టోబర్ 19 నుంచి ప్రారంభమయ్యే భారత్-ఆస్ట్రేలియా వన్డే సిరీస్ జట్టులో షమీకి చోటు దక్కని విషయం తెలిసిందే. షమీని జట్టులోకి తీసుకోకపోవడంపై మొదట పెద్దగా చర్చలు లేకపోయిన తాజాగా ఆయన స్పందించడంపై దుమారం చెలరేగింది. ఈ సందర్భంగా షమీ మాట్లాడుతూ.. తన చేతుల్లో సెలక్షన్ ఉండదని పేర్కొన్నారు. తనకు ఫిట్నెస్ సమస్య ఉంటే తాను బెంగాల్ కోసం రంజీ ట్రోఫీ ఆడలేని పరిస్థితి ఉంటుందని తెలిపారు. నాలుగు రోజుల మ్యాచ్ ఆడగలిగితే, 50 ఓవర్ల క్రికెట్ కూడా ఆడగలను అని తేల్చి చెప్పారు. ఫిట్‌నెస్ గురించి సెలెక్షన్ కమిటీకి సమాచారం అందించడం తన పని కాదన్నారు. ఎన్‌సీఏకు వెళ్లి సిద్ధమవడం.. మ్యాచ్‌లాడటమే తన పని అని షమి స్పష్టం చేశారు. తనని ఎంపిక చేయకపోతే బెంగాల్ కోసం ఆడతాను, దానిపై ఎలాంటి అభ్యంతరం లేదని షమీ వివరించారు. దేశం కోసం ఉత్తమ ఆటగాళ్లను ఎంపిక చేయాలి. గెలుపు దేశానికే చెందాలి అని ఆయన వ్యాఖ్యనించారు. షమీ చివరిసారి మార్చ్ 2025లో చాంపియన్స్ ట్రోఫీలో భారత్ తరపున ఆడారు. ఆ సిరీస్‌లో వరుణ్ చక్రవర్తితో కలిసి టాప్ వికెట్ టేకర్‌గా నిలిచాడు. అయినప్పటికీ ఆ తర్వాత ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్, ఆసియా కప్, ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌లలో షమీకు అవకాశం ఇవ్వలేదు. అయితే తాజాగా.. షమీ చేసిన వ్యాఖ్యలు స్పష్టంగా బీసీసీఐ నిర్ణయంపై అసహనాన్ని వ్యక్తం చేస్తున్నాయి.

# బిజినెస్



## ఎల్ఐసీ దీపావళి ధమాకా..

## మహిళల కోసం 2 సూపర్ స్కీమ్స్




పిల్లల, మహిళలు, వృద్ధులు ఇలా అన్ని వర్గాల వారికి ఎల్ఐసీ వివిధ పథకాలను అందుబాటులో ఉంచింది. తాజాగా దీపావళి ధీమాకాగా ఎల్ఐసీ రెండు సూపర్ స్కీమ్స్ ను ప్రకటించింది. అయితే ఇక్కడ ఓ ట్విస్ట్ ఉంది.దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఎన్నో రకాల సేవలు అందిస్తూ ప్రజల్లో మంచి స్థానం సంపాదించింది. అందుకే ఎల్ఐసీ నుంచి ఎటువంటి సమాచారం వచ్చినా చూసేందుకు జనం ఆసక్తి చూపిస్తుంటారు. ఇదే సమయంలో ప్రజలను ఆకట్టుకునేందుకు ఎల్ఐసీ సంస్థ కూడా తరచూ ఏదో ఒక స్కీమ్ ప్రకటిస్తుంది.పిల్లల, మహిళలు, వృద్ధులు ఇలా అన్ని వర్గాల వారికి ఎల్ఐసీ వివిధ పథకాలను అందుబాటులో ఉంచింది. తాజాగా దీపావళి ధీమాకాగా ఎల్ఐసీ రెండు సూపర్ స్కీమ్స్ ను ప్రకటించింది. అయితే ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే.. వీటిల్లో ఓ పథకం కేవలం మహిళలకు మాత్రమే. ఇక ఆ రెండు స్కీమ్స్ ఏంటి, వాటి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం..ఎల్ఐసీ సంస్థ జన సురక్ష (ప్లాన్ 880), బీమా లక్ష్మి (ప్లాన్ 881) పేరుతో రెండు ప్లాన్లను తీసుకొచ్చింది. నేటి(అక్టోబర్ 15) నుంచి ఈ రెండు పాలసీలు కొనుగోలుకు అందుబాటులో ఉంటాయి. తక్కువ ఆదాయం ఉన్న వారి కోసం 'జన సురక్ష'ను తీసుకురాగా.. 'బీమా లక్ష్మి' కేవలం మహిళల కోసం ఉద్దేశించినది. అందరికీ బీమా కల్పించాలన్న ఉద్దేశంతో తక్కువ ధరలో జన సురక్ష ప్లాన్‌ను ఎల్ఐసీ ప్రారంభించింది.జన సురక్ష ప్లాన్‌ను నాన్ పార్టిసిపేటింగ్, నాన్ లింక్డ్ ఇన్సూరెన్స్ స్కీమ్. అంటే ఇది మార్కెట్‌కు అనుసంధానమై ఉండదు. బోనస్ చెల్లింపులూ ఉండవు. మైక్రో ఇన్సూరెన్స్ కావడంతో ఇక్కడ తక్కువ ప్రీమియంతో ఆర్థికంగా బలహీన వర్గాల వారికి రక్షణ కల్పిస్తోంది. 18–55 ఏళ్ల వయసున్నవారు ఎవరైనా ఈ ప్లాన్ ఎంచుకోవచ్చు. కనీస బీమా హామీ మొత్తం రూ.లక్ష కాగా.. గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు ఎంచుకోవచ్చు.'బీమా లక్ష్మి' ప్లాన్ మహిళలకు బీమా సదుపాయం కల్పించాలన్న ముఖ్య ఉద్దేశంతో తీసుకొచ్చింది. ఇందులో బీమా, పొదుపు రెండూ ఉంటాయి. ఇది కూడా జన సురక్ష మాదిరిగానే నాన్ పార్టిసిపేటింగ్, నాన్ లింక్డ్ స్కీమ్. అంటే మార్కెట్ ఒడిదుడుకులతో సంబంధం లేదు. పైగా బోనస్ చెల్లింపులు ఉండవు. ఈ ప్లాన్ లో మూడు రకాల ఆప్షన్లు ఉంటాయి. ఎంచుకున్న ఆప్షన్ బట్టి హామీ మొత్తాన్ని విడతల వారీగా లబ్ధిదారులు పొందొచ్చు. ఇందులో కనీస బీమా హామీ మొత్తం రూ.2 లక్షలు కాగా.. గరిష్ఠ మొత్తంపై పరిమితి లేదు.18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల వయస్సు మహిళలు ఈ ప్లాన్ కు అర్హులు. దీనికి సంబంధించి పూర్తి వివరాలకు ఎల్ఐసీకి సంబంధించిన అధికారిక వెబ్ సైట్‌లో చూడవచ్చు.




## రికార్డు స్థాయిలో దూసుకెళ్తున్న.. బంగారం ధరలు

హైదరాబాద్: బంగారం ధరలు రోజురోజుకు రికార్డు స్థాయిలో దూసుకెళ్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీగా పెరుగుతూ.. పసిడి ప్రియులకు బంగారం చుక్కలు చూపిస్తోంది. సామాన్య, మధ్య తరగతి కుటుంబం వారు బంగారం అనే మాట కూడా ఎత్తడానికి వీలు లేకుండా.. బంగారం ధరలు ఆకాశానంటుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా బుధవారం కూడా బంగారం ధరలు పెరిగాయి. వివరాల్లోకి వెళితే.. ఈరోజు 1 గ్రాము 24 క్యారెట్ల బంగారం ధర రూ.12,836 గా ఉంది, అదేవిధంగా 1 గ్రాము 22 క్యారెట్ల బంగారం ధర రూ.11,766 గాను, 1 గ్రాము 18 క్యారెట్ల బంగారం ధర రూ.9,627గా ఉంది.అలాగే 10 గ్రాముల 24 క్యారెట్ల ధర రూ.1,28,360, 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,17,660, 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర రూ. 96,270గా ఉంది. పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో గోల్డ్‌కు భారీగా డిమాండ్ పెరుగుతోంది. రోజురోజుకు భారీగా పెరుగుతూ.. సరికొత్త రికార్డులను తిరగరాస్తున్నాయి. బంగారంతో పాటు.. సిల్వర్ ధరలు కూడా భారీగా పెరుగుతున్నాయి. చరిత్రలో ఎన్నడూ లేనంతగా బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయికి చేరడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.బంగారం ధరలు అన్ని నగరాల్లో ఒకే విధంగా ఉండవు. స్థానిక డిమాండ్, సరఫరా, అలాగే రాష్ట్ర పన్నులు, తదితర అంశాల ప్రకారం ధరలు మారుతుంటాయి. పసిడి పరుగులకు అంతర్జాతీయంగా పలు పరిణామాలు కారణం అవుతాయి. అయితే ఈ ధరలు మరింత పెరిగే అవకాశముందని బులియన్ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. కాగా, నిన్న(మంగళవారం) ఒక్కరోజే.. సమారుగా మూడు వేలకు పైగా పెరిగిన విషయం తెలిసిందే.

## పారిశ్రామికంలోనూ యువ సత్తా




న్యూఢిల్లీ: దేశ పారిశ్రామిక రంగంలోనూ యువత సత్తా చాటుతోంది. వినూత్న వ్యాపారాలతో తనదైన ముద్ర వేస్తోంది. ఈ ఏడాది సెప్టెంబరు 1 నాటికి 155 మంది యువత వినూత్న వ్యాపారాలతో 44,300 కోట్ల డాలర్ల (సుమారు రూ.39 లక్షల కోట్లు) సంపద సృష్టించింది. ప్రస్తుత మన జీడీపీ లో ఇది దాదాపు 10 శాతానికి సమానం. నాలుగు పదుల వయసు కూడా నిండకుండానే వీరు ఈ సంపద సృష్టించినట్టు వెలువడిన 'ది అవెండాస వెల్త్–హురున్ ఇండియా అండర్ 35 లిస్ట్ 2025' నివేదిక వెల్లడించింది. ఈ జాబితాలో రేజన్ సోలార్‌కు చెందిన హార్దిక్ కొటియా అగ్రస్థానంలో ఉండగా వికాస్ గోయల్ (కుకు ఎఫ్ఎం), మిను మార్గరెట్ (బ్లిస్ క్లబ్), రితేష్ అగర్వాల్ (ఓయో, ప్రిజమ్) ఉన్నారు. అలాగే ఇషా అంబానీ (రిలయన్స్ రిటైల్), కావ్య కళానిధి మారన్ (సన్ టీవీ నెట్‌వర్క్), రితిక మోహన్ (గరుడ ఏరోస్పేస్) కూడా ఈ జాబితాలో ఉన్నారు. కాగా హైదరాబాద్‌కు చెందిన ఈక్వల్ వ్యవస్థాపకుడు కేశవ్ రెడ్డి, అవంతీ ఫీడ్స్‌కు చెందిన అల్లూరి వెంకట సంజీవ్, అశీష్ గోయెంకాలతో పాటు మరో ముగ్గురు యువ పారిశ్రామికవేత్తలూ ఉన్నారు. ఈ యువ పారిశ్రామిక దిగ్గజాలందరూ సంపదతో పాటు వ్యవస్థలనూ నిర్మిస్తున్నారని హురున్ ఇండియా నివేదిక కితాబిచ్చింది.,ఎంపిక ఇలా: ఈ జాబితా ఎంపిక కోసం కొన్ని నిర్దిష్ట ప్రామాణికాలు పాటించారు. తొలి తరం పారిశ్రామికవేత్తలైతే వారు సృష్టించిన కనీస సంపద విలువ ఐదు కోట్ల డాలర్లకు మించి, అదే వారసత్వ కుటుంబ వ్యాపారమైతే 10 కోట్ల డాలర్లకు మించి ఉండాలని ప్రామాణికంగా నిర్ణయించారు. మరోవైపు సంపద సృష్టితో పాటు ఈ యువ పారిశ్రామికవేత్తలు ఉద్యోగాల కల్పనలోనూ ముందున్నారు. ప్రస్తుతం వీరి కంపెనీల్లో 7.67 లక్షల మంది పనిచేస్తున్నట్టు నివేదిక తెలిపింది. ఇందులో ఇషా అంబానీ (33) నేతృత్వంలోని రిలయన్స్ రిటైల్‌లో అత్యధికంగా 2,47,782 మంది పని చేస్తున్నారు. ఆకాశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ జియోలోనూ పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పని చేస్తున్నారు.

## టెక్ మహీంద్రా లాభం రూ 1195 కోట్లు




న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26)లో సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి (క్యూ2) టెక్ మహీంద్రా నికర లాభం వార్షిక ప్రాతిపదికన 4.5 శాతం తగ్గి రూ.1,194.5 కోట్లకు పరిమితమైంది. గత ఆర్థిక సంవత్సరం (2024–25)లో ఇదే కాలానికి కంపెనీ రూ.1,250 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. కాగా, ఈ జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో గడించిన రూ.1,141 కోట్ల లాభంతో పోలిస్తే 4.7 శాతం వృద్ధి నమోదైంది. ఈ క్యూ2లో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 5.1 శాతం పెరిగి రూ.13,995 కోట్లకు చేరింది. క్యూ1తో పోలిస్తే రెవెన్యూ 4.8 శాతం పెరిగింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను వాటాదారులకు రూ.5 ముఖవిలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.15 (300 శాతం) మధ్యంతర డివిడెండ్ చెల్లించనున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఇందుకు అర్హులైన షేర్‌హోల్డర్లను ఎంపిక చేసేందుకు ఈ నెల 21 రికార్డు తేదీగా నిర్ణయించింది. వచ్చే నెల 12 లేదా ఆ లోపు డివిడెండ్ చెల్లించనున్నట్లు సంస్థ స్పష్టం చేసింది. మరిన్ని విషయాలు..ఆర్థిక అనిశ్చితుల కారణంగా ఈ క్యూ2లో అమెరికా మార్కెట్ నుంచి ఆదాయం 2 శాతానికి పైగా తగ్గిందని, కంపెనీకి కీలకమైన టెలికాం రంగం నుంచి రాబడి 2.5 శాతం తగ్గిందని టెక్ మహీంద్రా ఎండీ, సీఈఓ మోహిత్ జోషి తెలిపారు. మాన్యుఫాక్చరింగ్, బీఎఫ్ఎసఐ రంగాల ఆదాయం మాత్రం వరుసగా 5.2 శాతం, 6.5 శాతం పెరిగిందన్నారు.

గడిచిన త్రైమాసికంలో 81.6 కోట్ల డాలర్ల విలువైన కొత్త డీల్స్ దక్కించుకున్నట్లు, వార్షిక ప్రాతిపదికన డీల్స్ విలువ 57 శాతం పెరిగిందని కంపెనీ తెలిపింది.

గత త్రైమాసికంలో కంపెనీ మొత్తం ఉద్యోగుల సంఖ్య 1,559 తగ్గి 1.52 లక్షలకు పరిమితమైంది.

## భారతదేశాన్ని కట్టడి చేయాలంటూ కి చైనా ఫిర్యాదు




ఇంటర్నెట్ డెస్క్: భారతదేశాన్ని కట్టడి చేయాలంటూ దాయాది దేశం చైనా ప్రపంచ వాణిజ్య సంస్థ కి మొరపెట్టుకుంది. భారతదేశంలో (ఎలక్ట్రానిక్ వెహికల్స్), ఇంకా బ్యాటరీ ఉత్పత్తులపై ఆ దేశ ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలు మా కొంప ముంచుతున్నాయని డబ్ల్యూటీవోకి ఫిర్యాదు చేసింది. ఎలక్ట్రిక్ వాహనాలు, ఇంకా బ్యాటరీ ఉత్పత్తికి సంబంధించిన భారతదేశపు సబ్సిడీ కార్యక్రమాలను సవాలు చేస్తూ.. చైనా ప్రపంచ వాణిజ్య సంస్థకు అధికారిక ఫిర్యాదును దాఖలు చేసింది.పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రకారం, భారతదేశం చేస్తున్న సబ్సిడీ చర్యలు, దిగుమతి ప్రత్యామ్నాయ సబ్సిడీలకు సమానమని ఫిర్యాదులో ఆరోపించింది. ఇవి నిబంధనల ప్రకారం నిషేధించబడ్డాయని పేర్కొంది. ఈ సబ్సిడీలు వేగంగా పెరుగుతున్న విద్యుత్ వాహనాలు, బ్యాటరీ రంగాలలో భారతీయ పరిశ్రమలకు అన్యాయమైన పోటీ ప్రయోజనాన్ని ఇస్తాయని కూడా చైనా ఆరోపించింది.

అంతేకాదు, ఈ అంశంపై దగ్గర సంప్రదింపులకు రావాలని భారత్‌కు చెప్పాలని చైనా కోరింది. భారతదేశం అనుసరిస్తున్న అన్యాయమైన పద్ధతులను వివరించి సరిదిద్దాలని ప్రపంచ వాణిజ్య సంస్థను చైనా అభ్యర్థించింది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006